

డీఎస్సీపై అసత్య ఆరోపణలు చేయడం వైసీపీ మానుకోవాలి.డీఎస్సీపై అసెంబ్లీలో చర్చకు కూటమి ప్రభుత్వం సిద్ధం. ఈ నెల 17 నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాలకు జగన్ రావాలి. వైసీపీ ఆరోపణలకు ఆధారాలుంటే అసెంబ్లీలో బయటపెట్టాలి.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ



శుక్రవారం 14.08.2026

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 సంచిక - 114 www.journalistfile.com పేజీలు 8 వెల : రూ.5.00


# రాజధానికి రాజమార్గం.. సీడ్ యాక్సెస్





## అమరావతి నిర్మాణంలో తొలి మెట్టు

## ఐదు కాన్సెప్టులతో ప్రపంచం మెచ్చే రాజధాని

## స్టీల్ బ్రిడ్జిలు, సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన సీఎం చంద్రబాబు

**అమరావతి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** సీడ్ యాక్సెస్ రహదారి ప్రారంభంతో రాజధాని అమరావతికి రాజమార్గం ఏర్పాటు అయ్యిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రాభివృద్ధిలో, అమరావతి నిర్మాణంలో ఇది మొదటి మెట్టు అని సీఎం స్పష్టం చేశారు. ఉండవల్లి వద్ద రాజధాని అమరావతిని విజయవాడ – మంగళగిరి – గుంటూరులతో కలిపే కలిపే ప్రధాన రహదారి సీడ్ యాక్సెస్ రోడ్డు ఈ–3ని ముఖ్యమంత్రి ప్రారంభించారు. సీడ్ యాక్సెస్ రహదారిని అనుసంధానించేలా బకింగ్ హామ్ కాలువపై నిర్మించిన స్టీల్ బ్రిడ్జిలను కూడా సీఎం ప్రారంభించారు. వీటి ప్రారంభానికి సూచికగా ఉండవల్లి వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని మంత్రులు పి.నారాయణ, నాదెండ్ల మనోహర్‌లతో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. రాయపూడి నుంచి వెంకటపాలెం– పెనుమాక మీదుగా ఉండవల్లి వరకూ సీడ్ యాక్సెస్ రహదారిని సీఆర్డీఏ నిర్మించింది. స్టీల్ బ్రిడ్జిలను ప్రారంభించటంతో రాజధాని నగరానికి మెరుగైన కనెక్టివిటీ వచ్చినట్టైంది. మూడో దశలో మణిపాల్ ఆస్పత్రి సమీపంలో జాతీయ రహదారి 16కు అనుసంధానించేలా ప్రణాళిక చేశారు. దీనికి రూ. 1,519 కోట్ల వ్యయం కానుంది. స్టీల్ బ్రిడ్జిలతో పాటు సీడ్ యాక్సెస్ రహదారిని సీఎం కాలినడకన తిరిగి ఆసాంతం పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ... "రాష్ట్రాభివృద్ధి విజన్‌కు అమరావతి నగర నిర్మాణం మొట్టమొదటి సక్సెస్. తెలుగు జాతి గర్వపడేలా ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నిర్మాణం జరిగింది. విభజన తర్వాత రాష్ట్రం నష్ట పోయింది. రాజధాని కూడా లేకుండా పోయింది. 25 పార్లమెంటు స్థానాల్లో మధ్యలో ఉన్న గుంటూరు జిల్లాలో రాజధాని పెట్టాలని ఆనాడు సంకల్పించాం. విస్తృత చర్చల తర్వాత మాపై విశ్వాసంతో రైతులు రాజధాని నిర్మాణం కోసం ముందుకు వచ్చి భూములు ఇచ్చారు. రాష్ట్ర రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులందరికీ పాదాభివందనం చేస్తున్నాను. రైతులది త్యాగం కాదు స్ఫూర్తి. సింగపూర్ అమరావతి బృహత్ ప్రణాళికను ఉచితంగా ఇచ్చి సహకరించింది. గత పాలకులు ప్రజలతో పాటు సింగపూర్ ప్రతినిధులను కూడా వేధింపులకు గురిచేశారు. మిగతా 2లో...

# విద్యుత్‌కు 'పంప్డ్ స్టోరేజ్' బలం



- 130 రిజర్వాయర్ల వద్ద ప్రాజెక్టుల అవకాశాలపై అధ్యయనం
- తక్కువ ధరకు నిరంతర విద్యుత్ అందించేలా సమగ్ర ప్రణాళిక
- విద్యుత్ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు

3లో

# చర్చ తక్కువ.. బిల్లులు ఎక్కువ!

- 12 కీలక బిల్లులకు పార్లమెంట్ ఆమోదం
- వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ ఉత్పాదకత 19 శాతం
- రాజ్యసభ 39 శాతం
- ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు..



**న్యూఢిల్లీ, (జర్నలిస్ట్ ఫైల్) :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు విపక్షాల నిరసనలు, సభ వాయిదాల నడుమ నిరవధికంగా ముగిశాయి. జూలై 20న ప్రారంభమైన వర్షాకాల సమావేశాలు ఆగస్టు 13న ముగిశాయి. మొత్తం 25 రోజుల పాటు కొనసాగిన ఈ సమావేశాల్లో ఉభయ సభలు 19 రోజుల పాటు సమావేశమయ్యాయి. ఈ సందర్భంగా లోక్‌సభ 19 శాతం, రాజ్యసభ 39 శాతం ఉత్పాదకతను నమోదు చేశాయి. శాసన వ్యవహారాల పరంగా ప్రభుత్వం ఉభయ సభల్లో 12 కీలక బిల్లులను ఆమోదింపజేసుకుంది. మిగతా 2లో...

# కుంకీలతో ఘర్షణలకు కళ్లెం

- పంట నష్టం తగ్గింపు..
- రాష్ట్రంలోనే ఏనుగులకు శిక్షణ



**విశాఖ (జర్నలిస్ట్ ఫైల్) :** ఆంధ్రప్రదేశ్ ఏజెన్సీ ప్రాంతాల్లో మానవ–వన్యప్రాణి సంఘర్షణను నివారించడంతో పాటు ఏనుగుల సంరక్షణకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో కేంద్ర సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. గతంలో చిత్తూరు, పార్వతీపురం మన్యం ప్రాంతాల్లో ఏనుగుల గుంపుల వల్ల ప్రజలు, రైతులు ఎదుర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు కర్ణాటక నుంచి నాలుగు కుంకీ ఏనుగులను తీసుకొచ్చి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

కుంకీ ఏనుగుల సహాయంతో ఇప్పటికే 15 కార్యకలాపాలు చేపట్టి మంచి ఫలితాలు సాధించామని, మిగతా 2లో...

# కాశీకి ఇక విమానంలోనే!



- విజయవాడ-వారణాసి మధ్య నేరుగా కొత్త విమాన సర్వీసులు
- వారానికి మూడు రోజులు.. మంగళ, గురు, శనివారాల్లో ఇండిగో విమానాలు
- ప్రయాణ సమయం తగ్గింపు.. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఊతం

**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ ప్రజలకు మరో కీలక విమాన కనెక్టివిటీ అందుబాటులోకి వచ్చింది. విజయవాడ విమానాశ్రయం నుంచి వారణాసికి నేరుగా నూతన ఇండిగో సర్వీసులను పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. దీంతో రాష్ట్ర ప్రజలకు కాశీ యాత్ర మరింత సులభం కానుంది. ఈ విమాన సర్వీసులు వారానికి మూడు రోజుల పాటు అందుబాటులో ఉంటాయి. మిగతా 2లో...

# ఎస్సీలకు పథకాలన్నీ.. ఒక్క క్లిక్‌తో



- ఎస్సీ కార్పొరేషన్ అధికారిక వెబ్‌సైట్ ప్రారంభం
- రుణాలు, సబ్సిడీలు, సంక్షేమ పథకాల వివరాలు ఒకేచోట
- నర్సింగ్ విద్యార్థులకు ఉచిత భాషా శిక్షణ.. విదేశాల్లో ఉపాధి అవకాశాలు

**అమరావతి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్ సైట్ ని ఉపయోగించుకొని అర్హులైన వారు ఆయా సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. గురువారం తాడేపల్లిలోని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్సి కార్పొరేషన్ అధికారిక వెబ్సైట్ (https://apsccorporation.ap.gov.in/) ప్రారంభించారు. ఈ వెబ్ సైట్ లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపరిచారు. పథకాలకు సంబంధించిన అర్హతలు, రుణ పరిమితి, సబ్సిడీ వంటి వివరాలతో పాటు ఆయా పథకాలకు సులభతరంగా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వీలుగా వెబ్సైట్ రూపొందించారు. ఈ సందర్భంగా మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ ఎస్సీలకు విద్య, నైపుణ్య శిక్షణ, స్వయం ఉపాధితో పాటు వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎస్సి కార్పొరేషన్ వెబ్సైట్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పలు బ్యాంకింగ్, సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, రాజమండ్రి, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు కేంద్రాలుగా ఒక్కో కేంద్రంలో 50 మంది చొప్పున ఇంగ్లీషు భాషలో ప్రావీణ్యం కోసం ఉచిత శిక్షణ అందించి వారికి ఇజ్రాయెల్ దేశంలో ఉపాధి కల్పిస్తామన్నారు. దీని కోసం ఈ వెబ్ సైట్ లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మిగతా 2లో...

# ఎస్‌హెచ్‌జీలకు రుణ సడలింపు



- 8 మంది సభ్యులున్నా రిపీట్ డోస్‌కు అవకాశం
- మరణం, వలసలతో సభ్యులు తగ్గినా అర్హత
- ఆరు నెలల్లో సభ్యుల సంఖ్య 10కి పెంచుకోవాలి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**అమరావతి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తూ ఏపీ గ్రామీణ బ్యాంక్ తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అభినందించారు. సభ్యుల మరణం లేదా వలసల కారణంగా సంఘంలో సభ్యుల సంఖ్య 10 మందికి తగ్గినా, సంఘం పనితీరు, రుణ చెల్లింపుల రికార్డు సక్రమంగా ఉంటే రిపీట్ డోస్ రుణం పొందేందుకు అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. ఏపీ గ్రామీణ బ్యాంక్ అంతర్గత ఉత్తర్వులు నంబర్ 152 ప్రకారం కనీసం ఎనిమిది మంది క్రియాశీల సభ్యులున్న సంఘాలకు రిపీట్ డోస్ రుణం మంజూరు చేయవచ్చని తెలిపారు. సభ్యుల సంఖ్య తగ్గడానికి మరణం లేదా వలస మాత్రమే కారణమై ఉండాలని, అక్రమాలు, పాత బకాయిలు లేకుండా సక్రమంగా రుణాలు చెల్లించి ఉండాలని, అర్హత కలిగిన సంఘాలు ప్రత్యేక తీర్మానం, బాధ్యతా పత్రం సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రుణ సడలింపు పొందిన సంఘాలు ఆరు నెలల్లోగా సభ్యుల సంఖ్యను తిరిగి కనీసం 10 మందికి పెంచుకోవాలని మంత్రి తెలిపారు. మహిళలకు అందించే రుణం కేవలం ఆర్థిక సాయం మాత్రమే కాదని, మిగతా 2లో...

## ఏపీలో మోగనున్న
# స్థానిక నగారా!



- ఓటర్ల జాబితాల ప్రచురణకు ఎస్ఈసీ ఆదేశాలు
- సెప్టెంబర్ 3న పురపాలికల్లో.. ఆగస్టు 17న 20 పంచాయతీల్లో జాబితాలు
- ఆగస్టు 31లోగా పోలింగ్ కేంద్రాల ఖరారు
- సెప్టెంబర్-అక్టోబర్‌లో స్థానిక ఎన్నికలకు అవకాశం

2లో

# 'స్ప్రైట్' తేజస్ ఎక్స్‌ప్రెస్




- బ్రాండ్ పేరుతో నడిచే తొలి భారతీయ ప్యాసింజర్ రైలు
- లక్నో-ఢిల్లీ మార్గంలో ఆరు నెలల పాటు బ్రాండింగ్
- టికెట్ ధర పెంచకుండా రైల్వేకు అదనపు ఆదాయం

**ఢిల్లీ(జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ రైల్వే చరిత్రలో ఒక సరికొత్త అధ్యాయం ఆరంభమైంది. దేశంలోనే తొలిసారిగా ఒక ప్యాసింజర్ రైలుకు ప్రైవేట్ బ్రాండ్ పేరును ఖరారు చేశారు. లక్నో–ఢిల్లీ–లక్నో మార్గంలో నడిచే తేజస్ ఎక్స్‌ప్రెస్, ప్రముఖ శీతల పానీయాల బ్రాండ్ 'స్ప్రైట్'తో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఇకపై 'స్ప్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్'గా ప్రయాణికులకు సేవలు అందించనుంది.

ఇండియన్ రైల్వే క్యాటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ (ఐఆర్‌సీటీసీ), స్ప్రైట్ బ్రాండ్‌కు ఆరు నెలల కాలపరిమితితో ఈ రైలు బ్రాండింగ్, ప్రకటనల హక్కులను కేటాయించింది. - 2లో...

# ఊబకాయం కోరల్లో ఆరోగ్యం

- ప్రజారోగ్యానికి సవాలుగా మారిన ఊబకాయం..
- రాష్ట్రంలో ప్రతి ఇద్దరిలో ఒకరికి అధిక బరువు
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

**విజయవాడ, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో ఊబకాయం ప్రజారోగ్యానికి తీవ్రమైన సవాల్‌గా మారుతోందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ఆరోగ్య శాఖతో పాటు విద్య, క్రీడలు, మహిళా శిశు సంక్షేమ శాఖలను భాగస్వామ్యం చేస్తూ జాయింట్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. విజయవాడలో సీఐఐ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఊబకాయం, జీవక్రియ ఆరోగ్యంపై రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి మాట్లాడారు. మారుతున్న ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ తగ్గడం, అల్ట్రా ప్రాసెస్డ్ ఆహారం, చక్కెర పానీయాలు, అధిక స్క్రీన్ సమయం వంటి కారణాలతో ఊబకాయం పెరుగుతోందన్నారు. మిగతా 2లో...



## కుంకీలతో ఘర్షణలకు కళ్లెం




(మొదటి పేజీ తరువాయి)

అటవీ సరిహద్దు ప్రాంతాల్లో మానవ మరణాలు 70 శాతం తగ్గడంతో పాటు పంట నష్టం కూడా తగ్గిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోనే కుంకీ ఏనుగులకు శిక్షణ ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందని, ప్రస్తుతం శిక్షణ పొందిన కుంకీ ఏనుగు జయంత్ పార్వతీపురం మన్యం ప్రాంతంలో సేవలందిస్తోందని తెలిపారు. ప్రతి ఏటా రెండు కుంకీ ఏనుగులకు శిక్షణ ఇవ్వాలనేది ప్రభుత్వ ప్రణాళికగా వివరించారు.

మానవ-వన్యప్రాణి సంఘర్షణలను నివారించేందుకు 2026 మార్చిలో ప్రారంభించిన H.A.N.U.M.A.N ప్రాజెక్టుతో మంచి ఫలితాలు వస్తున్నాయని పవన్ కల్యాణ్ తెలిపారు. ఇందులో 93 స్పందన వాహనాలు, ఏడు వన్యప్రాణి అంబులెన్స్‌లు ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు 200కు పైగా వన్యప్రాణులను రక్షించడంతో పాటు 30కి పైగా తరలింపు కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. ప్రజలు, వన్యప్రాణులను విడదీయడం ప్రభుత్వ లక్ష్యం కాదని, రెండూ సురక్షితంగా కలిసి జీవించే పరిస్థితులు కల్పించడమే అసలైన విజయమని పేర్కొన్నారు.

అంతర్జాతీయ ఏనుగుల దినోత్సవం సందర్భంగా "ప్రాజెక్ట్ ఎలిఫెంట్ 30 జెయింట్ స్టెప్స్" పుస్తకాన్ని పవన్ కల్యాణ్, కీర్తివర్ధన్ సింగ్ ఆవిష్కరించారు. దక్షిణ భారతదేశ ఏనుగుల సంరక్షణ యాక్షన్ ప్లాన్, వన్యప్రాణి శాస్త్రానికి సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. ఏనుగుల సంరక్షణపై నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర అటవీ శాఖల ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తలు, పర్యావరణవేత్తలు పాల్గొన్నారు.

## కాశీకి ఇక విమానంలోనే!

(మొదటి పేజీ తరువాయి)

మంగళ, గురు, శనివారాలు ఈ నగరాల మధ్య విమానాలు నడపనున్నారు. ఈ సందర్భంగా రామ్మోహన్‌నాయుడు మాట్లాడుతూ.. ప్రాంతీయ విమాన కనెక్టివిటీని మరింత బలోపేతం చేయడంతో పాటు దేశంలోని టైర్-2, టైర్-3 నగరాలను ప్రధాన విమానాశ్రయాలకు అనుసంధానం చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. విజయవాడ-వారణాసి మధ్య నేరుగా విమాన సర్వీసు ప్రారంభం రాష్ట్ర విమానయాన రంగంలో మరో కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. విమాన ప్రయాణాన్ని ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకురావడం, ప్రయాణ సమయాన్ని తగ్గించడం, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడం ద్వారా ఈ కొత్త సర్వీసు ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చనుందన్నారు.

మరోవైపు హుస్సేన్ సాగర్, ప్రకాశం బ్యారేజ్, శ్రీశైలం జలాశయం మధ్య సీ ప్లేన్ ప్రాజెక్ట్ కోసం వ్యూహరచన సిద్ధం చేస్తున్నామని రామ్మోహన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కేశినేని శివనాథ్, బాలశౌరి, పౌర విమానయానశాఖ కార్యదర్శి సమీర్ కుమార్ సిన్హా, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఇండిగో ప్రతినిధులు పాల్గొన్నారు.


## 'స్ట్రైట్' తేజస్ ఎక్స్‌ప్రెస్

(మొదటి పేజీ తరువాయి)

రైల్వే వర్గాల సమాచారం ప్రకారం, ఆగస్టు 19 నుంచి నవంబర్ 11 వరకు ఇరువైపులా ప్రయాణించే 82501, 82502 నంబర్ల రైళ్లను స్టేషన్లలో 'స్ట్రైట్ తేజస్ ఎక్స్‌ప్రెస్'గా ప్రకటించనున్నారు.

ప్రయాణికులపై టికెట్ ధరల భారం మోపకుండా, వాణిజ్య ప్రకటనల ద్వారా అదనపు ఆదాయాన్ని ఆర్జించే దిశగా రైల్వే శాఖ ఈ వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. ఈ రైలును ఐఆర్‌సీటీసీ ప్రైవేట్‌గా నిర్వహిస్తున్నప్పటికీ, ట్రాక్‌లు, స్టేషన్ల వంటి మౌలిక సదుపాయాలను వినియోగించుకున్నందుకు గాను భారత రైల్వేకు నిర్ణీత రుసుము చెల్లిస్తుందని ఒక సీనియర్ అధికారి తెలిపారు. అత్యాధునిక వసతులు, మెరుగైన ఆన్‌బోర్డ్ సేవలు, వినోద సాధనాలు కలిగిన ప్రీమియం రైలు కావడంతో, ఈ పైలట్ ప్రాజెక్ట్ కోసం తేజస్ ఎక్స్‌ప్రెస్‌ను ఎంపిక చేశారు.

## ఎస్సీలకు పథకాలన్నీ.. ఒక్క క్లిక్‌తో



(మొదటి పేజీ తరువాయి)

నర్సింగ్ విద్యార్థులకు విశాఖ, గుంటూరు, తిరుపతి కేంద్రాలుగా జర్మన్ లాంగ్వేజ్ లో ఉచిత శిక్షణ ఇప్పించి జర్మనీలో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. నిరుద్యోగ ఎస్సీ యువతకు వివిధ రంగాలలో నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉపాధి కల్పిస్తామని మంత్రి తెలిపారు. ఔత్సాహికులు ఈ వెబ్ సైట్ ని ఉపయోగించుకొని ఆయా పథకాలకు దరఖాస్తు చేసుకోవాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. ఈ కార్యక్రమంలో మాదిగ, మాల కార్పొరేషన్ చైర్మన్లు ఉండవల్లి శ్రీదేవి, పెదపూడి విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం. ఎం నాయక్, ఎస్సి కార్పొరేషన్ జనరల్ మేనేజర్ చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌హెచ్‌జీలకు రుణ సడలింపు



(మొదటి పేజీ తరువాయి)

వారి జీవనోపాధి, స్వయం ఉపాధి, ఆర్థిక సాధికారతకు బలమైన ఆధారమన్నారు. రాష్ట్రంలోని మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసి ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇదే తరహాలో రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్‌బీసీ), ఇతర బ్యాంకులు కూడా మంచి రికార్డు ఉన్న స్వయం సహాయక సంఘాలకు 10 మంది సభ్యుల నిబంధనను సడలించి రుణ పునరుద్ధరణను సులభతరం చేయాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కోరారు.

# రాజధానికి రాజమార్గం.. సీడ్ యాక్సెస్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ కాంప్లెక్సు భవనాలు ప్రత్యేకంగా ఉండాలని ప్రముఖ ఆర్కిటెక్టులతో డిజైన్లు చేయించాం. కొందరు గ్రాఫిక్స్ అంటూ ఎగతాళి చేశారు. ఆ గ్రాఫిక్స్ నిజం అవుతుంటే ఎగతాళి చేసిన వాళ్లంతా తలలు దించుకోవాలి. అమరావతితో పాటు అన్ని ప్రాంతాలకూ అభివృద్ధి వికేంద్రీకరించేలా ప్రణాళికలు చేశాం. అసెంబ్లీలో రాజధాని 40 వేల ఎకరాలు కావాలన్న వ్యక్తి తర్వాత మూడు రాజధానులని మాట తిప్పేశాడు. 2019-24 మధ్య రైతుల ఉద్యమాన్ని చరిత్ర మర్చిపోదు. అమరావతితో పాటు రాష్ట్రం అంతటా అభివృద్ధి కావాలన్నదే నా ఆకాంక్ష. అమరావతిని ఆహ్లాదకరంగా ఉండేలా తీర్చిదిద్దుతున్నాం. "అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



**రాజధాని నిర్మాణంలో ఐదు కాన్సెప్టులు :** "అమరావతి రాజధానికి రాజమార్గం సీడ్ యాక్సెస్ రోడ్డు అందుబాటులోకి వచ్చేసింది. నగర నిర్మాణంలో ఇది ప్రారంభం మాత్రమే. మూడో దశలో ఇది తాడేపల్లి వద్ద జాతీయ రహదారికి కనెక్టు అవుతుంది. అమరావతి రాజధాని పూర్తి కాలుష్య రహిత నగరంగా మారుతుంది. డీప్‌టెక్ క్యాపిటల్ గా దీనిని తయారు చేస్తున్నాం. ఐదు ముఖ్యమైన అంశాలతో రాజధాని నిర్మాణం చేపడుతున్నాం. నో పోల్స్, బ్లూ, గ్రీన్, గ్రీన్ ఎనర్జీ, క్వాంటం డీప్ టెక్ లాంటి ఐదు కాన్సెప్టులతో నిర్మాణం జరుగుతోంది. ఏఐ, క్వాంటం కంప్యూటర్ వ్యాలీగా అమరావతి మారుతుంది. టాప్ 5 నగరాల్లో ఒకటిగా తయారవుతుంది

అమరావతి, మంగళగిరి-తాడేపల్లి, గుంటూరు, విజయవాడ కార్పొరేషన్లు రాజధాని పరిధిలోనే ఉంటాయి. 190 కిలోమీటర్ల అవుటర్, 96 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు మంజూరు చేసిన కేంద్రానికి ధన్యవాదాలు. 2028 నాటికి భారత్ మెచ్చిన రాజధానిగా అమరావతిని ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. సింధూ నాగరికత తరహాలోనే రాజధాని నగరంలో సీడ్ యాక్సెస్ రహదారులు నిర్మాణం జరుగుతున్నాయి. ఇక అమరావతి అన్ స్టాపబుల్. రాజధాని లో నిర్మిస్తున్న రోడ్డును అడ్డుకునేందుకు కొందరు ప్రయత్నించారు. ఈ తరహా వ్యక్తులతో రాష్ట్రానికి చాలా ప్రమాదం. రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దుష్టమైన లక్ష్యాలను పెట్టుకుంటున్నాం". అని సీఎం అన్నారు.

**జెండా- సాధించాల్సిన అజెండాతో సంకల్పం :** "2047 నాటికి ఏపీని స్వర్ణాంధ్ర చేయాలన్న సంకల్పం తీసుకున్నాం. ప్రజలు వ్యక్తులుగా మీరేం సంకల్పం తీసుకున్నారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని చేతిలో జాతీయ జెండా, మనస్సులో అజెండాతో సాధించాల్సిన లక్ష్యాన్ని సంకల్పం చేయండి. అనునిత్యం మీ సంకల్పాన్ని నెరవేర్చుకునే ఆలోచనలు చేస్తే రాష్ట్రాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యం అవుతుంది. మనకు స్వాతంత్ర్యం ఎందుకు వచ్చిందన్న అంశాన్ని అంతా మర్చిపోతున్నాం. జెండా వందనంతో పాటు దేశాన్ని అగ్రస్థానంలో నిలబెట్టేలా ఆలోచనలు చేయటం ముఖ్యం. రైతులు, విద్యార్థులు, కార్మికులు, వ్యాపారులు ఎవరైనా తమ తమ స్థాయిల్లో కృషి చేయాలి. ప్రతీ ఇల్లు, వాణిజ్య సంస్థ పైనా జాతీయ జెండా ఎగరాలి. మండల, అసెంబ్లీ నియోజకవర్గాలు, జిల్లాల్లో తిరంగా ర్యాలీలు నిర్వహించాలి. ఓ ప్రజా ఉద్యమంగా తిరంగా ర్యాలీ జరగాలి. వచ్చే 21 ఏళ్లలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర కల సాకారం కావాలి. ఆ శక్తి సామర్థ్యాలను ప్రజలే అందించాలి. అమరావతి రాజధాని అభివృద్ధికి ప్రజలూ ఆలోచనలు పంచుకోవాలి. అమరావతి ఆర్థిక రాజధానిగా ఎదగాలి. "అని సీఎం అన్నారు. అనంతరం మంత్రులు నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రవణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణలతో కలిసి రాయపూడి వద్ద నూతనంగా నిర్మించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల భవన సముదాయాన్ని సీఎం పరిశీలించారు.

# ఊబకాయం కోరల్లో ఆరోగ్యం

(మొదటి పేజీ తరువాయి)

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-6 ప్రకారం రాష్ట్రంలో 47.90 శాతం మహిళలు, 44.40 శాతం పురుషులు అధిక బరువుతో ఉన్నారని మంత్రి తెలిపారు. అంటే రాష్ట్రంలో దాదాపు ప్రతి ఇద్దరిలో ఒకరు అధిక బరువుతో ఉన్నట్లేనని వివరించారు. దేశవ్యాప్తంగా కూడా ఊబకాయం సమస్య వేగంగా పెరుగుతోందని, పిల్లల్లో అధిక బరువు సమస్య మరింత ఆందోళన కలిగిస్తోందన్నారు. చిన్నారుల్లో బహిరంగ క్రీడలు, శారీరక కార్యకలాపాలు తగ్గడం సమస్యను తీవ్రతరం చేస్తోందని చెప్పారు. ఊబకాయాన్ని నిర్లక్ష్యం చేస్తే ప్రజల ఆరోగ్యంతో పాటు ఉత్పాదకత, ఆర్థిక ప్రగతిపైనా ప్రభావం పడుతుందని పేర్కొన్నారు.




ఊబకాయ నియంత్రణకు సీఐఐ సదస్సులో వచ్చిన సూచనల ఆధారంగా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తామని మంత్రి తెలిపారు. ఫుడ్ సేఫ్టీ విభాగాన్ని మరింత బలోపేతం చేసి ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. సదస్సులో వచ్చిన ప్రతిపాదనలను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు అందజేసి, ఆయన సూచనల మేరకు తదుపరి చర్యలు చేపడతామని చెప్పారు. రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ద్వారా పిల్లల ఎత్తు, బరువును నమోదు చేయడంతో పాటు జీవక్రియ సంబంధిత సమస్యలను ముందుగానే గుర్తించే చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాష్ట్రంలో అసాంక్రమిక వ్యాధుల పరిస్థితిపై జిల్లాల వారీగా మ్యాపింగ్ చేపట్టామని సత్యకుమార్ తెలిపారు. ఇప్పటివరకు నిర్వహించిన ఎన్‌సీడీ సర్వేలో 59 లక్షల మందికి రక్తపోటు, 48 లక్షల మందికి మధుమేహం ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. యూనివర్సల్ హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమం కింద మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా 41 రకాల వైద్య పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తున్నామని, కుప్పంలో ప్రారంభమైన ఈ కార్యక్రమాన్ని దశలవారీగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని తెలిపారు. సంజీవని పథకం ద్వారా ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి ఆసుపత్రుల్లో చికిత్స పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ చక్రధర్‌బాబు మాట్లాడుతూ సాంకేతికత పెరగడం, మారుతున్న జీవన విధానంతో శారీరక శ్రమ తగ్గిపోవడం ఊబకాయం పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయని అన్నారు. సహజ ఆహారానికి ప్రాధాన్యమిస్తూ నూనె, ఉప్పు, చక్కెర వినియోగాన్ని తగ్గించి, నిత్యం శారీరక శ్రమ చేయాలని సూచించారు. ఊబకాయాన్ని ముందుగానే గుర్తించి నివారించేందుకు వైద్య ఆరోగ్య శాఖ సమగ్ర పరీక్షలు, ముందస్తు గుర్తింపుపై దృష్టి సారిస్తోందన్నారు. సీఐఐ రాష్ట్ర ఛైర్మన్ నరేంద్రకుమార్, మాజీ ఛైర్మన్ డాక్టర్ వి.మురళీకృష్ణ, ప్రిన్సిపల్ అడ్వైజర్ (హెల్త్‌కేర్) డాక్టర్ షబ్నమ్ సింగ్, వైద్యులు, ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ రంగాల నిపుణులు సదస్సులో పాల్గొన్నారు.

## ఏపీలో మోగనున్న స్థానిక నగారా!




**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్) :** ఏపీ లో ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి కీలక ముందడుగు పడింది. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఓటర్ల జాబితాల ప్రచురణకు నోటిఫికేషన్లు జారీ చేయడంతో ఎన్నికల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైనట్టయింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో సెప్టెంబర్ 3న ఫొటో ఎలక్టోరల్ రోల్స్‌ను ప్రచురించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, గతంలో జాబితాలు ప్రచురించని 20 గ్రామ పంచాయతీల్లో ఆగస్టు 17న ఓటర్ల జాబితాలను ప్రకటించాలని స్పష్టం చేశారు.

ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు యంత్రాంగాన్ని సిద్ధం చేసే పనులను ఎస్ఈసీ వేగవంతం చేసింది. ఇటీవల మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల కార్యదర్శులతో కమిషనర్ పునేఠా సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. ఎన్నికల నిర్వహణలో మొదటి దశ అయిన ఓటర్ల జాబితాల ప్రకటనతో ఈ కసరత్తు మొదలైంది. రాష్ట్రవ్యాప్తంగా 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లోని 4,033 డివిజన్లు, వార్డులకు ఓటర్ల జాబితాలను ప్రచురించనున్నారు. వీటిలో 17 కార్పొరేషన్లు, 88 మున్సిపాలిటీలు, 18 నగర పంచాయతీలు ఉన్నాయి. 2021లో కొన్ని చోట్ల న్యాయస్థానాల్లో కేసుల కారణంగా ఎన్నికలు నిలిచిపోగా, ఈసారి అన్నిచోట్లా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మరోవైపు, గ్రామ పంచాయతీల్లో కూడా ఎన్నికల ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 21 నుంచి 31వ తేదీలోగా రాష్ట్రంలోని 13 వేలకు పైగా గ్రామ పంచాయతీల్లో పోలింగ్ కేంద్రాల జాబితాలను ప్రచురించాలని, వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ఖరారు చేయాలని ఆదేశించారు. 2026 జనవరి 1వ తేదీని అర్హతగా తీసుకుని తుది ఓటర్ల జాబితాలను సిద్ధం చేయనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో మేయర్లు, ఛైర్మన్లు, కార్పొరేటర్లు, కౌన్సిలర్ పదవులకు రిజర్వేషన్లను ఖరారు చేసే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో అంతా ప్రణాళిక ప్రకారం జరిగితే సెప్టెంబర్ లేదా అక్టోబర్ నెలల్లో స్థానిక ఎన్నికలు జరగవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

## ఆందోళన వద్దు...అర్హులందరికీ 'నేతన్నల సేవలో' ఆర్థిక సాయం

**అమరావతి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** 'నేతన్నల సేవలో' పథకం కింద అర్హులైన ప్రతి నేతన్నకు రూ.25 వేల ఆర్థిక సాయం అందిస్తామని రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత తెలిపారు. సాంకేతిక కారణాలతో కొందరి ఖాతాల్లో నగదు జమ కాలేదని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఇటీవల వచ్చిన కొత్త దరఖాస్తులను పరిశీలించి ఈ నెల 20లోగా అర్హులకు ఆర్థిక సాయం అందిస్తామని వెల్లడించారు. నేతన్నల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, వదంతులు నమ్మకుండా సందేహాలుంటే సమీప చేనేత, జౌళి శాఖ అధికారులను సంప్రదించాలని సూచించారు.

# చర్చ తక్కువ.. బిల్లులు ఎక్కువ!

(మొదటి పేజీ తరువాయి)

అయితే వాటిలో అత్యధిక బిల్లులు పెద్దగా చర్చ లేకుండానే ఆమోదం పొందడం చర్చనీయాంశంగా మారింది.

పార్లమెంట్ సమావేశాల్లో బిల్లులపై తగినంత చర్చ జరగకపోవడంపై విపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. మరోవైపు ప్రతిపక్షాల నిరసనల కారణంగానే సభా కార్యకలాపాలు సజావుగా సాగలేదని కేంద్ర ప్రభుత్వం ఆరోపించింది. ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉన్నప్పటికీ విపక్షాలు సభను అడ్డుకున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. ఈ పరిణామాల మధ్యే సమావేశాలు ముగిశాయి.

**చర్చ లేకుండానే పలు బిల్లులకు ఆమోదం :** సమావేశాల వివరాల ప్రకారం.. లోక్‌సభలో ఆమోదం పొందిన 12 బిల్లుల్లో 11 బిల్లులు ఎలాంటి విస్తృత చర్చ లేకుండానే ఆమోదం పొందాయి. పేపర్ లీకేజీలు, పరీక్షల్లో అక్రమాలను అరికట్టేందుకు తీసుకొచ్చిన 'ప్రభుత్వ పరీక్షల్లో అక్రమ పద్ధతుల నిరోధక సవరణ బిల్లు'పై మాత్రమే కొంత విస్తృతంగా చర్చ జరిగింది. మైనింగ్ సంస్కరణలు, పన్నులు, ట్రిబ్యునళ్లు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్య పెంపు వంటి అంశాలకు సంబంధించిన బిల్లులు కూడా పెద్దగా చర్చ లేకుండానే సభలను దాటాయి.

మొత్తం సమావేశాల కాలంలో లోక్‌సభ ఉత్పాదకత 19 శాతంగా నమోదైంది. రాజ్యసభ ఉత్పాదకత 39 శాతానికి పరిమితమైంది. సభా కార్యకలాపాలకు నిరసనలు, వాయిదాలు పదేపదే అడ్డంకిగా మారడంతో అనేక అంశాలపై చర్చకు అవకాశం లేకుండా పోయింది.

**కాంగ్రెస్ వైఖరిపై కిరణ్ రిజిజు ఆగ్రహం :** పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మాట్లాడుతూ.. సభలో చర్చలు జరగకుండా కాంగ్రెస్ పార్టీ కావాలనే అడ్డుపడిందని విమర్శించారు. ప్రభుత్వం ప్రతి అంశంపై చర్చకు సిద్ధంగా ఉన్నప్పటికీ.. ప్రతిపక్షం చర్చ నుంచి తప్పించుకునేందుకు రకరకాల కారణాలు చూపిందని ఆరోపించారు. ఈ తరహా పరిస్థితుల వల్ల కొత్తగా ఎన్నికైన ఎంపీలకు పార్లమెంటరీ చర్చల్లో పాల్గొనే అవకాశం తగ్గిపోతోందని ఆయన అన్నారు.



**ఆమోదం పొందిన 12 బిల్లులు :** ఈ వర్షాకాల సమావేశాల్లో ఉభయ సభలు మొత్తం 12 బిల్లులకు ఆమోదం తెలిపాయి. వీటిలో జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక (సవరణ) బిల్లు-2026 ఒకటి. జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకునే చర్యలను శిక్షార్హమైనవిగా పరిగణించేలా చట్టంలో మార్పులు తీసుకురావడం ఈ బిల్లులోని ప్రధాన అంశంగా పేర్కొన్నారు.

ప్రభుత్వ పరీక్షల్లో అక్రమ పద్ధతుల నిరోధక (సవరణ) బిల్లు-2026 కూడా ఆమోదం పొందింది. పోటీ పరీక్షల్లో పేపర్ లీకేజీలు, పరీక్షల్లో అక్రమ పద్ధతులు, మాల్‌ప్రాక్టీస్ వంటి చర్యలను అరికట్టేందుకు ఈ బిల్లును తీసుకొచ్చారు.

జననాలు, మరణాల నమోదు (సవరణ) బిల్లు-2026కు కూడా ఉభయ సభలు ఆమోదం తెలిపాయి. జనన, మరణాల ఆలస్య నమోదుకు సంబంధించిన ప్రక్రియను మరింత క్రమబద్ధీకరించడం, నిబంధనలను కఠినతరం చేయడం ఈ సవరణలోని ముఖ్య ఉద్దేశంగా పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు (న్యాయమూర్తుల సంఖ్య) సవరణ బిల్లు-2026 కూడా పార్లమెంట్ ఆమోదం పొందింది. సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించడం, పెండింగ్ కేసుల పరిష్కారానికి వేగం తీసుకురావడం కోసం న్యాయమూర్తుల సంఖ్యను పెంచే ఉద్దేశంతో ఈ బిల్లును తీసుకొచ్చారు.

సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు-2026కు కూడా ఆమోదం లభించింది. సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు సులభంగా నమోదు చేసుకునే అవకాశం కల్పించడం, స్వచ్ఛంద నమోదును ప్రోత్సహించడం, జాతీయ డిజిటల్ వేదిక ద్వారా వ్యాపార ప్రక్రియలను సులభతరం చేయడం ఈ బిల్లులోని ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు.

బ్యాంకర్ల పుస్తకాల సాక్ష్య బిల్లు-2026 కూడా పార్లమెంట్ ఆమోదం పొందింది. బ్యాంకులు నిర్వహించే డిజిటల్, మేఘ ఆధారిత రికార్డులను కూడా చట్టపరమైన సాక్ష్యాలుగా గుర్తించేలా నిబంధనలను మార్చేందుకు ఈ బిల్లును తీసుకొచ్చారు.

పన్నులు, ఇతర చట్టాల (సవరణ) బిల్లు-2026 కూడా ఆమోదం పొందింది. అంతర్జాతీయ మార్కెట్లలో వస్తున్న మార్పులు, ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా ఆదాయపు పన్ను చట్టంలో అవసరమైన మార్పులు తీసుకురావడం ఈ సవరణ ఉద్దేశంగా పేర్కొన్నారు.

కేరళ (పేరు మార్పు) బిల్లు-2026కు కూడా పార్లమెంట్ ఆమోదం తెలిపింది. రాజ్యాంగంలోని మూడో అధికరణం ప్రకారం కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు ఈ బిల్లు ఉద్దేశించబడింది.

జాతీయ సహకార అభివృద్ధి సంస్థ (సవరణ) బిల్లు-2026కు కూడా ఆమోదం లభించింది. సహకార రంగానికి ఆర్థిక సహాయాన్ని వేగవంతం చేయడం, సంస్థ పరిధిని విస్తరించడం, సహకార రంగ అభివృద్ధికి మరింత మద్దతు అందించడం ఈ సవరణ ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు.

ట్రిబ్యునళ్ల సంస్కరణల బిల్లు-2026 కూడా ఉభయ సభల ఆమోదం పొందింది. వివిధ ట్రిబ్యునళ్ల చైర్‌పర్సన్లు, సభ్యుల నియామకాలు, వారి అర్హతల్లో పారదర్శకత, ఏకరూపత తీసుకురావడంతో పాటు 'జాతీయ ట్రిబ్యునళ్ల కమిషన్' ఏర్పాటుకు ఈ బిల్లు అవకాశం కల్పిస్తుంది.

గనులు, ఖనిజాల (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు-2026 కూడా ఆమోదం పొందింది. ఖనిజ రంగంలో మరింత సమర్థవంతమైన, స్థిరమైన ఆర్థిక వ్యవస్థను తీసుకురావడం, దేశీయ ఖనిజ వనరుల వినియోగాన్ని పెంచడం, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు మద్దతు ఇవ్వడం ఈ సవరణ ముఖ్య ఉద్దేశాలుగా పేర్కొన్నారు.

కేటాయింపుల (నంబర్-3) బిల్లు-2026కు కూడా పార్లమెంట్ ఆమోదం తెలిపింది. బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయించిన నిధులను వినియోగించేందుకు అవసరమైన ద్రవ్య అనుమతులకు సంబంధించిన బిల్లు ఇది.

**తక్కువ ఉత్పాదకతతో ముగిసిన సమావేశాలు :** వర్షాకాల సమావేశాల్లో ప్రభుత్వం 12 కీలక బిల్లులను ఆమోదింపజేసుకున్నప్పటికీ.. సభా కార్యకలాపాల ఉత్పాదకత మాత్రం తక్కువగానే నమోదైంది. లోక్‌సభ 19 శాతం, రాజ్యసభ 39 శాతం ఉత్పాదకతతో సమావేశాలను ముగించాయి. విపక్షాల నిరసనలు, సభలో నినాదాలు, పదేపదే వాయిదాలు వంటి పరిణామాలు కార్యకలాపాలపై ప్రభావం చూపాయి.

ఒకవైపు ప్రభుత్వం కీలక బిల్లులను ఆమోదింపజేసుకున్నామని చెబుతుండగా.. మరోవైపు బిల్లులపై తగినంత చర్చ జరగలేదని విపక్షాలు విమర్శిస్తున్నాయి. దీంతో ఈ వర్షాకాల సమావేశాలు శాసనపరమైన కార్యకలాపాలతో పాటు సభా నిర్వహణ, చర్చల తీరుపై కూడా రాజకీయ చర్చకు దారితీశాయి.

## ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం



**వేమూరు, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** భట్టిప్రోలు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఆరుగురు అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.1,96,160 ఆర్థిక సాయం మంజూరైంది. ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారి వైద్య ఖర్చుల బిల్లులను వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సిఫార్సు లేఖ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధి కార్యాలయానికి పంపగా, అధికారులు పరిశీలించి రీయింబర్స్‌మెంట్ మంజూరు చేశారు. గోరికపూడికి చెందిన వరికూటి లక్ష్మీలీలావతికి రూ.37,378, వరికూటి వెంకట సుశీలకు రూ.44,333, సూరేపల్లికి చెందిన బొర్రా లక్ష్మీకిరణ్మయికి రూ.36,283, భట్టిప్రోలుకు చెందిన షేక్ కరీముల్లాకు రూ.30 వేలు, పల్లెకోనకు చెందిన చీకటి వనజకు రూ.23 వేలు, పెదలంకకు చెందిన బొర్రా నాగేంద్రంకు రూ.25,166 చొప్పున సాయం లభించింది. మొత్తం రూ.1,96,160 విలువైన ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు లబ్ధిదారులకు, వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేద, మధ్యతరగతి కుటుంబాల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని, వైద్య చికిత్సల అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అందే ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. నియోజకవర్గంలో అర్హులైన ప్రతి బాధిత కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా కృషి చేస్తామని చెప్పారు. సాయం అందించిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.

## కన్నా లక్ష్మీనారాయణ స్వర్ణోత్సవ వేడుకల్లో నక్కా ఆనందబాబు



**గుంటూరు, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** గుంటూరు నగరంలోని ఇన్నర్ రింగ్‌రోడ్ ఫేజ్-2లోని శ్రీ కన్వెన్షన్‌లో మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు, సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ 50 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రాజకీయ స్వర్ణోత్సవ వేడుకల్లో వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ స్వయంగా రచించిన 'కన్నా' స్వీయచరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించడంతో పాటు ఆయన 73వ జన్మదిన వేడుకలు నిర్వహించారు. నక్కా ఆనందబాబు కన్నా లక్ష్మీనారాయణకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, మరిన్ని సంవత్సరాలు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. కన్నా లక్ష్మీనారాయణ ఐదు దశాబ్దాల రాజకీయ ప్రస్థానం, ప్రజాసేవ పట్ల నిబద్ధత, నాయకత్వ పటిమ యువతకు, రాజకీయాల్లోకి వస్తున్న వారికి స్ఫూర్తిదాయకమని నక్కా ఆనందబాబు పేర్కొన్నారు.


## ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** భారతీయ జనతా పార్టీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గం మూడో మండలం అధ్యక్షురాలు గాయత్రి బెహరా ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ హిందూ మహిళా డిగ్రీ కళాశాల నుంచి హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. 75 మీటర్ల భారీ జాతీయ జెండాతో చేపట్టిన ర్యాలీని బీజేపీ సీనియర్ నాయకుడు జూపూడి రంగరాజు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్‌నారాయణ, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, జిల్లా ఇన్‌చార్జి దొరబాబు జాతీయ జెండాను ఊపి ప్రారంభించారు. విద్యార్థులు, యువత, మహిళలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ దేశ సమగ్రత, ఐక్యతను చాటడంతో పాటు స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను విద్యార్థులు, యువతకు తెలియజేసి వారిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్ర మోదీ హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి పిలుపునిచ్చారని తెలిపారు. ఇందులో భాగంగానే భారీ తిరంగా యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగమల్లేశ్వరి, బీజేపీ లిటరేచర్ కమిటీ రాష్ట్ర కన్వీనర్ పాలపాటి రవికుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు సాదు రామకృష్ణ, మహిళా మోర్చా రాష్ట్ర కార్యదర్శి హరి పావని, జిల్లా కోశాధికారి డాక్టర్ స్రవంతి, మండల ప్రధాన కార్యదర్శి యశ్వంత్ లఖార, మండల ఉపాధ్యక్షులు మల్లికార్జున శర్మ, బాల రంగయ్య, జిల్లా యువజన నాయకుడు శశాంక్ శర్మతో పాటు మండల, పోలింగ్, బూత్ నాయకులు పాల్గొన్నారు.

## కడియం నర్సరీలకు ప్రపంచస్థాయి



**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** కడియం నర్సరీ రైతులు ప్రకృతి అందాలను ప్రపంచానికి పరిచయం చేస్తూ ప్రాంత ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నర్సరీ రైతుల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

నర్సరీ రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు, షేడ్‌నెట్స్, పాలీబ్యాగ్‌లను తక్కువ ధరలకు అందించేందుకు అసోసియేషన్ చేస్తున్న కృషిని అభినందించారు. రైతులకు బ్యాంకు రుణాలు మరింత సులభంగా అందేలా త్వరలో బ్యాంకర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. కడియం నర్సరీ అసోసియేషన్ ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ప్రశంసించిన మంత్రి, 'కడియం నర్సరీ అసోసియేషన్' బ్రాండ్‌తో నీటి బాటిళ్ల తయారీ వల్ల ప్రాంతానికి మరింత గుర్తింపు వస్తుందన్నారు.

# విద్యుత్‌కు 'పంప్డ్ స్టోరేజ్' బలం



**అమరావతి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రాష్ట్రంలో పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, తక్కువ ధరకు విద్యుత్ అందుబాటులోకి వచ్చేలా సమగ్ర ప్రణాళికలను తయారుచేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయంలో విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ... రాష్ట్రంలోని 130 రిజర్వాయర్ల వద్ద పంప్డ్ స్టోరేజ్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలు, సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేయాలన్నారు. పోలవరం వద్ద పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఏర్పాటుపై వచ్చిన ప్రతిపాదన ప్రస్తావనకు వచ్చిన సందర్భంలో ముఖ్యమంత్రి ఈ సూచన చేశారు. ఈ మేరకు అధ్యయనం చేయడంతోపాటు... ఎకనమిక్ ఫీజిబిలిటీపై స్టడీ చేయాలన్నారు. ఇక ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఉన్నందున్న వివిధ రిజర్వాయర్లు.. ప్రాజెక్టుల్లో విద్యుత్ ఉత్పత్తి కష్టసాధ్యం కావచ్చనే అంశాన్ని ప్రస్తావిస్తూ... విద్యుత్ ఉత్పత్తికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామికీకరణ వేగం పుంజుకోవడంతో పాటు... ప్రతి ఆరేళ్లకూ విద్యుత్ వినియోగం రెట్టింపు అవుతుందని... దానికి అనుగుణంగా ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో విద్యుత్ పంపిణీ నష్టాలను మరింత తగ్గించే చర్యలు చేపట్టాలని సూచించారు.

**సోలార్ విద్యుత్‌పై మరింత దృష్టి :** సౌర విద్యుత్ ఉత్పత్తిని వీలైనంత మేర పెంచాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. పీఎం సూర్యఘర్ కింద 6 లక్షల సోలార్ కనెక్షన్లను సెప్టెంబరు నాటికి ఇన్‌స్టాల్ చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాన్ సూర్య ఘర్ కింద మరో 3 లక్షల కనెక్షన్లను త్వరితగతిన ఏర్పాటు చేయాలన్నారు. వీటితో పాటు మరో 10 లక్షల కనెక్షన్ల కోసం కేంద్రానికి దరఖాస్తు చేయాలని చెప్పారు. ఇక కుసుమ్ పథకం కింద లక్ష్యాన్ని పూర్తిచేస్తూనే, అదనంగా 2,000 మెగావాట్ల సామర్థ్యం కోసం కేంద్రాన్ని కోరాలని సీఎం సూచించారు. సోలార్, విండ్, పంప్డ్ స్టోరేజ్ వంటి వనరులను సమన్వయం చేసుకుని తక్కువ ధరకు, నిరంతర విద్యుత్ అందించే వ్యవస్థను రూపొందించాలని సూచించారు. దీంతో పాటు విద్యుత్ కొనుగోలు ధరను ఈ ఏడాది యూనిట్‌కు రూ.4.60కు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సీఎం తెలిపారు. 2029 నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు ధరను రూ.4కు తీసుకురావాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తక్కువ ధర విద్యుత్ కొనుగోలుతోపాటు పవర్ స్వాపింగ్, కుసుమ్, సూర్యఘర్, పునరుత్పాదక విద్యుత్, స్టోరేజ్ వంటి వివిధ మోడళ్లను ఇంటిగ్రేట్ చేయాలన్నారు.

**విద్యుత్ సంస్థలకు రేటింగ్... కార్పొరేట్లతో పోటీ :** రాష్ట్రంలోని ఆరు విద్యుత్ సంస్థలకు పనితీరు ఆధారంగా రేటింగ్ విధానం తీసుకురావాలని సీఎం సూచించారు. ప్రతి సంస్థ సమర్థంగా పనిచేసేలా లక్ష్యాలు నిర్దేశించి, కార్పొరేట్ సంస్థలకు ధీటుగా విద్యుత్ సంస్థలను తీర్చిదిద్దాలని ఆదేశించారు. సంస్థల పనితీరు, ఆర్థిక సామర్థ్యం, నిర్వహణ సామర్థ్యాలను నిరంతరం సమీక్షించాలని చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లల్లో ఆప్టిమైజేషన్ ద్వారా రూ.234 కోట్లు, ప్రాంప్ట్ పేమెంట్ రిబేట్ కింద రూ.100 కోట్లను ఆదా చేసినట్టు అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం స్పందిస్తూ... విద్యుత్ సంస్థలపై రుణ భారాన్ని తగ్గించాలన్నారు. విద్యుత్ సంస్థల రుణాలపై నిరంతర సంప్రదింపులతో వడ్డీరేట్లను వీలైనంత మేర తగ్గించాలని ఆదేశించారు. సంస్థల పనితీరు మెరుగుపడుతున్న విషయాన్ని ఆర్థిక సంస్థల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు ఆర్థిక సంస్థలతో సంప్రదింపులు జరపాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆస్తుల కల్పన, మూలధన పెట్టుబడుల కోసం మాత్రమే ఇకపై విద్యుత్ సంస్థలు అప్పులు తీసుకోవాలి తప్ప... ఇతర అవసరాలకు అప్పులు చేసే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు. టారిఫ్ పెంచకుండా... కొనుగోలు వ్యయం, వడ్డీ భారం, పంపిణీ నష్టాలను తగ్గించడం ద్వారా సంస్థల ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని ముఖ్యమంత్రి అన్నారు. విద్యుత్ సంస్థల్లో డిజిటల్ ట్విన్ వ్యవస్థ, అసెట్ హెల్త్ ఇండెక్స్ విధానాలను అమలు చేస్తున్న అధికారులను సీఎం చంద్రబాబు అభినందించారు. విద్యుత్ వ్యవస్థలోని ఆస్తుల పరిస్థితిని డిజిటల్‌గా పర్యవేక్షించడం, ట్రాన్స్‌ఫార్మర్లు తదితర పరికరాల కండీషన్ ను ముందుగానే అంచనా వేసి మరమ్మతులు, మార్పులకు చర్యలు తీసుకోవడం ద్వారా వ్యయాన్ని తగ్గించడంతోపాటు నాణ్యమైన విద్యుత్ ను వినియోగదారులకు అందించేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవి, విద్యుత్ శాఖకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తాడికొండ గురుకులం, జీజీహెచ్ అభివృద్ధికి రూ.10.20 కోట్లు

- **గురుకులం హాస్టల్ నిర్మాణానికి రూ.5 కోట్లు.. జీజీహెచ్ పాత భవనం పునరుద్ధరణకు రూ.5.20 కోట్లు**
- **కేంద్ర సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్**



**గుంటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** జిల్లాలో విద్య, వైద్య రంగాల మౌలిక వసతులను మరింత బలోపేతం చేసేందుకు రూ.10.20 కోట్ల నిధులు మంజూ-రయ్యాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి, గుంటూరు ఎంపీ డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. తాడికొండలోని గురుకులం హాస్టల్ నిర్మాణానికి రూ.5 కోట్లు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జీజీహెచ్) పాత భవనం పునరుద్ధరణ పనులకు రూ.5.20 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. ఈ నిధులతో విద్యార్థులకు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించడంతో పాటు జీజీహెచ్‌లో పాత భవనాన్ని ఆధునీకరించి వైద్య సేవలను మరింత మెరుగుపర్చేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు.

తాడికొండ గురుకులం హాస్టల్ నిర్మాణానికి మంజూరైన రూ.5 కోట్లతో విద్యార్థులకు అవసరమైన వసతి సౌకర్యాలను అభివృద్ధి చేయనున్నారు. ప్రస్తుతం విద్యార్థులు ఎదుర్కొంటున్న వసతి సంబంధిత సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు, గురుకుల విద్యార్థులకు మెరుగైన వాతావరణం కల్పించేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని అవసరమైన నిధులను సమకూరుస్తోందని ఎంపీ తెలిపారు.

అదేవిధంగా గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల పాత భవనం పునరుద్ధరణకు రూ.5.20 కోట్లు మంజూరు కావడం ద్వారా ఆసుపత్రిలో మౌలిక వసతులు మరింత మెరుగుపడనున్నాయి. పాత భవనానికి అవసరమైన మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు, వైద్య సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు అవకాశం ఉంటుందని డా. పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. జీజీహెచ్‌పై ఆధారపడే గుంటూరు జిల్లా ప్రజలతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు కూడా ఈ అభివృద్ధి పనులు ప్రయోజనం చేకూర్చనున్నాయని తెలిపారు.

జిల్లా అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న సహకారానికి డా. పెమ్మసాని చంద్రశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. విద్య, వైద్యం, మౌలిక వసతుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గుంటూరు జిల్లాకు అవసరమైన ప్రాజెక్టులను గుర్తించి వాటికి నిధులు సాధించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. తాడికొండ గురుకులం, జీజీహెచ్ అభివృద్ధికి నిధుల మంజూరులో జిల్లా కలెక్టర్ సి.ఎం. సాయి కాంత్ వర్మ వివిధ శాఖలతో సమన్వయం చేస్తూ నిరంతరం ఫాలోఅప్ చేయడం అభినందనీయమన్నారు.

## పెనుగుదురుపాడుకు రూ.18.68 కోట్ల సంక్షేమ లబ్ధి

- **ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు**



**చుండూరు, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** కూటమి ప్రభుత్వం రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న '2 ఏళ్ల నమ్మకం--అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు చుండూరు మండలం పెనుగుదురుపాడులో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. తల్లికి వందనం, మహిళా శక్తి, అన్నదాత సుఖీభవ, దీపం--2, ఎన్టీఆర్ భరోసా తదితర సంక్షేమ పథకాల గురించి వివరించి, ప్రజల సమస్యలను మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. 723 కుటుంబాలు, 1,974 మంది జనాభా ఉన్న గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా సుమారు రూ.18.68 కోట్ల ప్రయోజనం అందిందని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా ద్వారా 310 మందికి నెలకు రూ.13.11 లక్షలు, తల్లికి వందనం ద్వారా 525 మంది విద్యార్థులకు రూ.78.75 లక్షలు, అన్నదాత సుఖీభవ ద్వారా 228 మంది రైతులకు రూ.31.92 లక్షలు, డ్వాక్రా తోడు ద్వారా 510 మంది మహిళలకు రూ.1.30 కోట్లు, పీఎం కిసాన్ ద్వారా 209 మంది రైతులకు రూ.12.54 లక్షలు, స్కాలర్‌షిప్‌ల ద్వారా 36 మంది విద్యార్థులకు రూ.19.90 లక్షలు, ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 15 మందికి రూ.6.45 లక్షల సాయం అందిందన్నారు.

గ్రామంలో జూన్ 2024 నుంచి రూ.19.60 లక్షల విలువైన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని నక్కా ఆనందబాబు తెలిపారు. అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణం, రెండు మినీ గోకులాల పనులు చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో 3.72 కిలోమీటర్ల సీసీ రోడ్లు, 1.20 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 3.5 కిలోమీటర్ల డ్రైనేజీ, వీధి దీపాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, కమ్యూనిటీ హాల్, బస్ షెల్టర్ వంటి మౌలిక వసతులు ఉన్నాయన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, 'స్వర్ణాంధ్ర--విజన్ 2047'తో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళు తున్నామని పేర్కొన్నారు. పెనుగుదురుపాడుకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అగ్రిగోల్డ్ ప్లాట్లపై జప్తు తొలగించి రిజిస్ట్రేషన్లు చేయాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** అగ్రిగోల్డ్ రియల్ ఎస్టేట్ ప్లాట్లపై ఉన్న జప్తును తొలగించి, పూర్తి మొత్తాన్ని చెల్లించిన ప్లాట్లను వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని అగ్రిగోల్డ్ ప్లాట్ల కొనుగోలుదారుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు కొక్కెర శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసేందుకు వచ్చిన అసోసియేషన్ ప్రతినిధులు, ముఖ్యమంత్రి పర్యటనలో కలెక్టర్ ఉండటంతో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలీకి వినతిపత్రం అందజేశారు. చేబ్రోలు గ్రామంలో 2010లో హనుమ వెంచర్ పేరుతో 298 ప్లాట్లు ఏర్పాటు చేయగా, 152 ప్లాట్లు రిజిస్టర్ అయ్యాయని, మిగిలిన 146 ప్లాట్లకు పూర్తి మొత్తాలు చెల్లించి అగ్రిమెంట్లు, స్వాధీన పత్రాలు పొందామని తెలిపారు. అనంతరం అగ్రిగోల్డ్ సంస్థ మూతపడటంతో సీఐడీ ద్వారా సంస్థ ఆస్తులను జీఓ ఎంఎస్ నంబర్ 21 కింద జప్తు చేసినట్లు వివరించారు.

గత పదేళ్లుగా హైకోర్టులో ఇంప్లీడ్ అయి న్యాయపరంగా పోరాడుతున్నామని, సీఐడీ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు పలుమార్లు వినతులు అందించినా సమస్య పరిష్కారం కాలేదని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వెంచర్‌ను అన్యాక్రాంతం చేసేందుకు జరిగిన ప్రయత్నాలను అడ్డుకుని ఆస్తులను పరిరక్షించుకున్నామని పేర్కొన్నారు. అగ్రిగోల్డ్ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇటీవల గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ కమిటీని ఏర్పాటు చేసిన నేపథ్యంలో తమ సమస్యను కూడా పరిష్కరించాలని కోరారు. జీఓ ఎంఎస్ నంబర్ 21ను తొలగించి, ఇప్పటికే రిజిస్టర్ అయిన ప్లాట్లకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలని, పూర్తి మొత్తాలు చెల్లించిన మిగిలిన ప్లాట్లను పరిశీలించి రిజిస్ట్రేషన్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దాసరి శివరామకృష్ణ, కేవీ ప్రసాద్, సూరి, శ్రీధర్, కాజా శ్రీనివాసరావు, రామచంద్రరావు, డీఎస్ఆర్ కృష్ణ, ఎం. వీరబ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యం



- **ప్రతి గ్రామంలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు**

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** గుంటూరులోని వాజ్‌పేయి భవన్‌లో బీజేపీ జిల్లా పదాధికారుల సమావేశం జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఈ నెల 18న బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ విశాఖపట్నం పర్యటన నేపథ్యంలో జిల్లాలోని మండల అధ్యక్షులు, రాష్ట్ర బాధ్యతల్లో ఉన్న నాయకులు విస్తృత రాష్ట్ర కార్యదర్శుల సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని సూచించారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ పోటీ చేసే ప్రతి స్థానంలో అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

ప్రతి గ్రామంలో బీజేపీ జెండా దిమ్మెలు ఏర్పాటు చేసేలా కార్యకర్తలు కృషి చేయాలని, అన్ని మోర్చాలను సంస్థాగతంగా బలోపేతం చేసి కొత్త నాయకత్వాన్ని తయారు చేయాలని నాయకులు సూచించారు. ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేసే విధంగా పార్టీ కమిటీలు పనిచేయాలని అన్నారు. సమావేశంలో వెలగలేటి గంగాధర్, నడ్డి నాగమల్లేశ్వరి, వై.వి. సుబ్బారావు, పాలపాటి రవికుమార్, తాడువాయి రామకృష్ణ, బజరంగ్ రామకృష్ణ, డాక్టర్ చరక కుమార్ గౌడ్, తోకల నాగరాజు, చాగంటి హరి పావని, కంతేటి బ్రహ్మయ్య, మంత్రి సుగుణ, కత్తి మేరీ సరోజినీ, సాధు రామకృష్ణ, సురేష్ జైన్, దానబోయిన శివయ్య, నారదాసు వీరమణి, డాక్టర్ దారా అంబేద్కర్, తురక రామారావు, తుంగ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ వసతిగృహాల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియాను అనుమతించాలి




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లోకి విద్యార్థి సంఘాలు, మీడియా ప్రతినిధుల ప్రవేశాన్ని నిరోధించే జీవోను వెంటనే ఉపసంహరించుకోవాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్‌ఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి తొండంనాటి ప్రశాంత్ డిమాండ్ చేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో ఆర్‌ఎస్‌యూ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. వసతిగృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం, తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలని, ఆహార సరఫరా, కొనుగోళ్లు, బిల్లులు, స్టాక్ రిజిస్టర్లపై సమగ్ర విచారణ జరపాలని కోరారు.

వసతిగృహాల నిధులపై సామాజిక ఆడిట్ నిర్వహించి అవినీతి, నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో విద్యార్థి సంఘాలు, మీడియా కీలక పాత్ర పోషిస్తాయని, భద్రతా నిబంధనల మేరకు వారికి పర్యవేక్షణకు అవకాశం కల్పించాలని కోరారు. విద్యార్థుల హక్కులు, నాణ్యమైన విద్య, పోషకాహారం కోసం రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో శాంతి, నరేందర్ రెడ్డి, చందు, కళిందర్, కొండయ్య, సూర్యనారాయణ, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత!

**తెనాలి(జర్నలిస్ట్ ఫైల్ ):** పట్నంలోని మారిస్ పేట, మఠంబజార్, ఎరువులు కొట్టు బజార్, ఖాన్ స్ట్రీట్ లలో విద్యుత్ లైన్ లకు మరమ్మతలు మరియు లైనులకు అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బోరుగడ్డ అశోక్ కుమార్ తెలియజేశారు. విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

# తెలంగాణ వాడవాడలా జాతీయ జెండా ఎగురవేయాలి..

- జనసేన ఆధ్వర్యంలో జరుగనున్న కార్యక్రమం..
- పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..



హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : భారతదేశం స్వాతంత్ర్య స్ఫూర్తిని ప్రతి పల్లెకు, ప్రతి పట్టణానికి తీసుకెళ్లేలా, ప్రతిఒక్కరిలో దేశభక్తి ప్రతిబింబించేలా జనసేన పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వాడవాడలా జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జనసేన తెలంగాణ రాష్ట్ర ఇన్చార్జ్ నేమూరి శంకర్ గౌడ్ పిలుపునిచ్చారు.

జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నట్లు, పార్టీ ముఖ్య నాయకులు ఈ వేడుకలకు హాజరవుతారని, అందుబాటులో ఉన్న నాయకులు, జన సైనికులు, వీర మహిళలు పాల్గొని జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించాలని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలోని జనసేన పార్టీ జిల్లా, పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గం, మండల, పట్టణ, గ్రామస్థాయి కార్యాలయాల్లో స్థానికంగా ఉండే రాష్ట్ర, జిల్లాస్థాయి నాయకుల అధ్వర్యంలో జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జాతీయ జండా ఆవిష్కరణ, జాతీయ గీతాలాపన, స్వాతంత్ర్య సమరయోధుల స్మరణ, దేశభక్తి కార్యక్రమాలు, విద్యార్థులు, యువత, మహిళల భాగస్వామ్యంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. భారత స్వాతంత్రం అనేది ఒక చారిత్రక ఘట్టం మాత్రమే కాదని, దేశం కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుల త్యాగాలను స్మరించుకునే పవిత్ర సందర్భమని పేర్కొన్నారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, ప్రజాస్వామ్యం, దేశ సమగ్రత వంటి విలువలను ప్రతి పౌరుడు ఆచరించేలా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించాలని సూచించారు.

# నిరుద్యోగులకు ఆమ్ ఆద్మీ పార్టీ అండగా ఉంటుంది..

- వెల్లడించిన తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్..
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిరుద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశం
- నిరుద్యోగులను అడ్డుకున్న పోలీసులు..
- నెలకొన్న ఘర్షణ వాతావరణం..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన నిరుద్యోగుల రౌండ్ టేబుల్ సమావేశానికి ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జీలోజు హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుద్యోగులు తమ ఉద్యోగాల సమస్యపై ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కార్యక్రమానికి వచ్చిన కోదండరాం రెడ్డిని.. నిరుద్యోగుల ఉద్యోగాల సమస్యపై సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని వారు కోరారు. నిరుద్యోగులను పోలీసులు అరెస్ట్ చేసేందుకు ప్రయత్నించడంతో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ హేమా సుదర్శన్ జీలోజును కూడా పోలీసులు అరెస్ట్ చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. విద్య, వైద్యం, నిరుద్యోగుల సమస్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ నిరంతరం పోరాడుతుందని హేమా సుదర్శన్ జీలోజు స్పష్టం చేశారు. అరెస్టులకు ఆమ్ ఆద్మీ పార్టీ భయపడదని, నిరుద్యోగుల తరపున తమ పోరాటం కొనసాగుతుందని తెలిపారు. నిరుద్యోగులకు ఆమ్ ఆద్మీ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని ఆమె పేర్కొన్నారు.



# ఆటో కార్మికులతో పెట్టుకున్న ప్రభుత్వాలు బతికి బట్టకట్టలేవు

- ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోల ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలి
- లేదంటే 5 లక్షల మంది ఆటో డ్రైవర్లు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పాతర పెడ్తరు
- టీఆర్టీయూ అనుబంధ ఆటో కార్మికుల సంఘం నాయకుల హెచ్చరిక
- ధర్నా చౌక్‌లో డ్రైవర్ల దీక్ష.. మహాధర్నా

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఆటో కార్మికులతో పెట్టుకున్న ఏ ప్రభుత్వానికి కూడా బతికి బట్టకట్టిన చరిత్ర లేదని తెలంగాణ రక్షణ సేన కార్మిక విభాగం టీఆర్టీయూ నేతలు అన్నారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ ఆటోలు నడిపించాలన్న నిర్ణయం ఆటో కార్మికుల జీవితాలను ఆగం చేస్తుందన్నారు. వెంటనే ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలని కోరుతూ తెలంగాణ రక్షణ ట్రేడ్ యూనియన్ అనుబంధ ఆటో కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ ధర్నా చౌక్ లో బుధవారం మహాధర్నా నిర్వహించారు. ఆటో కార్మికులకు అన్యాయం చేసే 263 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 20 మంది ఆటో కార్మికులు దీక్ష చేశారు. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు.



**ఆటో డ్రైవర్లతో పెట్టుకుంటే పుట్టగతులుండవు - రూప్ సింగ్ :** రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఆటో డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడుతోందని టీఆర్ఎస్ సీనియర్ నేత రూప్ సింగ్ మండిపడ్డారు. ఫ్రీ బస్సు పేరుతో ఈ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టిందని విమర్శించారు. అయినప్పటికీ ప్రభుత్వానికి భారం కాకుండా వారి బతుకేదో వారు బతుకుతున్నారన్నారు. అలాంటి ఆటో డ్రైవర్ల జీవితాలపై పిడుగు వేసినట్లు ఆర్టీసీ ఆధ్వర్యంలో ఎలక్ట్రిక్ ఆటోలు నడపాలని నిర్ణయించటం సరికాదన్నారు. ఆటో డ్రైవర్లతో పెట్టుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టలేదని, రేవంత్ సర్కార్ కు కూడా అదే గతి పడుతుందన్నారు. వెంటనే ఎలక్ట్రిక్ ఆటోల నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆటో డ్రైవర్లు పాతరేస్తారని హెచ్చరించారు.



**ఆటో డ్రైవర్లకు అన్యాయం జరిగితే ఊరుకోం - బోద జనార్ధన్:** రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని, వారికి అన్యాయం చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకునేది లేదని టీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి బోద జనార్ధన్ హెచ్చరించారు. ఎలక్ట్రిక్ ఆటోలను ఆర్టీసీ ఆధ్వర్యంలో నడపాలని నిర్ణయించటం సరికాదన్నారు. ఆటో డ్రైవర్ల కు మంచి చేయకపోయినా సరే చెడు చేసే కార్యక్రమాలు వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



ఆటోడ్రైవర్లకు అన్యాయం చేసే జీవో 263 ను వెంటనే రద్దు చేయాలని టీఆర్ఎస్ సీనియర్ నేతలు ఆర్.వి. ఆర్ ప్రసాద్, నరేష్ ప్రజాపతి డిమాండ్ చేశారు.

ప్రభుత్వంపై చేసే ఈ పోరాటంలో ఆటో డ్రైవర్లంతా ఐక్యంగా పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు పడాల మనోజ గౌడ్, వీరన్న తో పాటు ఆటో యునియన్ నాయకులు ఎం.ఎ. సలీం, నజీరోద్దీన్, మహేందర్ నాయక్, శ్రీధర్, శివ ప్రసాద్, అబ్దుల్ గని, టీఆర్టీయూ నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ అప్రెంటిస్‌లకు న్యాయం చేయాలి..

ఛలో సెక్రటేరియట్..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ పూర్తి చేసిన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈరోజు "ఛలో సెక్రటేరియట్" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. 2012 నుంచి 2025 వరకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసిన అనేక మంది అభ్యర్థులు ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, అప్రెంటిస్‌షిప్ సమయంలో తమ విలువైన సంవత్సరాలను కేటాయించినప్పటికీ తగిన ఉద్యోగ అవకాశాలు లభించలేదని తెలిపారు.

**ప్రధాన డిమాండ్లు :**

1. ఆర్టీసీ ఉద్యోగాల భర్తీ ఆర్టీసీ యాజమాన్యమే చేపట్టాలి. ఉద్యోగ నియామక ప్రక్రియను పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు అప్పగించకుండా, ఆర్టీసీ అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ యాజమాన్యమే నియామకాలు చేపట్టాలి.
2. ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసిన అభ్యర్థులకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇవ్వాలి. ఆర్టీసీలో ఇప్పటికే శిక్షణ పొందిన, సంస్థ పనితీరుపై అనుభవం ఉన్న అప్రెంటిస్‌లకు ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలి.
3. అప్రెంటిస్‌లకు వయోపరిమితిలో సడలింపు ఇవ్వాలి. ఏళ్ల తరబడి ఉద్యోగ నియామకాలు లేకపోవడం వల్ల వయోపరిమితి దాటిన అప్రెంటిస్‌లకు తగిన వయో సడలింపు ఇచ్చి మళ్లీ నియామక ప్రక్రియ చేపట్టాలి.
4. ప్రస్తుత రిక్రూట్‌మెంట్‌ను వెంటనే రద్దు చేసి పునఃపరిశీలించాలి. అప్రెంటిస్‌ల న్యాయమైన డిమాండ్లను పరిగణనలోకి తీసుకుని ప్రస్తుత నియామక ప్రక్రియను తక్షణమే రద్దు చేసి, అన్ని వర్గాలకు న్యాయం జరిగే విధంగా కొత్త నియామక ప్రక్రియ చేపట్టాలి.
5. 2012-2025 మధ్య అప్రెంటిస్‌షిప్ చేసిన అభ్యర్థులను గుర్తించి ఉద్యోగాలు కల్పించాలి. 2012 నుంచి 2025 వరకు ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేసిన అభ్యర్థుల వివరాలను ప్రభుత్వం సేకరించి, అర్హత కలిగిన వారికి ప్రత్యేక ప్రాధాన్యతతో ఉద్యోగ అవకాశాలు కల్పించాలి.




ప్రభుత్వం వెంటనే స్పందించాలి: అప్రెంటిస్‌ల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, సంబంధిత మంత్రి పొన్నం ప్రభాకర్, ఆర్టీసీ యాజమాన్యం వెంటనే ఈ సమస్యపై చర్చించి న్యాయం చేయాలని కోరుతున్నాము. "అప్రెంటిస్‌లకు న్యాయం చేయాలి - ఉద్యోగ అవకాశాలు కల్పించాలి" అనే డిమాండ్‌తో నేడు నిర్వహించే ఛలో సెక్రటేరియట్ కార్యక్రమానికి అప్రెంటిస్ అభ్యర్థులు, నిరుద్యోగ యువత, ప్రజాసంఘాలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ చైర్మన్, ఏపీ వికలాంగుల కార్పొరేషన్, మాజీ ఏఐసిసి సభ్యుడు బక్క జడ్సన్, పిలుపునిచ్చాడు..

# జంతర్ మంతర్‌లో జర్నలిస్టుల ధర్నాకు కేంద్రం స్పందన..

- టీడబ్ల్యూజేఎఫ్ వినతిపై చర్యలు ప్రారంభం..
- ప్రెస్ కౌన్సిల్‌కు కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ లేఖ..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) ఆధ్వర్యంలో జూలై 27న ఢిల్లీలోని జంతర్ మంతర్ లో నిర్వహించిన జర్నలిస్టుల ధర్నాపై కేంద్ర ప్రభుత్వం స్పందించింది. టీడబ్ల్యూజేఎఫ్ ధర్నా అనంతరం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించిన వినతిపత్రం పై చర్యలు ప్రారంభమయ్యాయి. జర్నలిస్టుల సంక్షేమం, హక్కులు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత, చట్టపరమైన రక్షణ తదితర అంశాలపై టీడబ్ల్యూజేఎఫ్ ప్రధానమంత్రి కార్యాలయానికి వినతిపత్రం సమర్పించింది. ఈ వినతి పత్రంలో అక్రిడేటెడ్ జర్నలిస్టులకు 50 శాతం రైల్వే ఛార్జీ రాయితీ, ఆన్‌లైన్ టికెట్ బుకింగ్ పునరుద్ధరణ, జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యకు చట్టపరమైన పరిష్కారం, స్వతంత్ర నేషనల్ మీడియా కమిషన్ ఏర్పాటు, వర్కింగ్ జర్నలిస్టుల చట్టాన్ని పునరుద్ధరించడం /సవరణలు చేయడం, జర్నలిస్టులకు ప్రత్యేక రక్షణ చట్టం, ప్రింట్,ఎలక్ట్రానిక్,డిజిటల్ మీడియా ఉద్యోగులకు రక్షణ, కొత్త వేజ్ బోర్డు ఏర్పాటు, జర్నలిస్టులకు జాతీయ పెన్షన్ పథకం తదితర డిమాండ్లను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వినతిపై పీ.ఎం.ఓ.పీ.జీ./డీ/2026/0139147 నంబరుతో జూలై 28న ఫిర్యాదు నమోదు కాగా, సంబంధిత అంశాన్ని పరిశీలించేందుకు మీడియా యూనిట్ సెల్ - 1కి బదిలీ చేసినట్లు రిజిస్ట్రేషన్ వివరాల్లో నమోదైంది. మరో కీలక



పరిణామంగా, కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ నుంచి 2026 ఆగస్టు 8న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యదర్శికి అధికారిక లేఖ జారీ అయింది. టీడబ్ల్యూజేఎఫ్ తరఫున సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సమర్పించిన ఫిర్యాదు ను ప్రస్తావిస్తూ, జర్నలిస్టుల సంక్షేమం, సేవా పరిస్థితులు, చట్టపరమైన రక్షణ, సామాజిక భద్రత, కార్మిక హక్కులకు సంబంధించిన అంశాలపై తగిన చర్యలు తీసుకుని, ఫిర్యాదును వీలైనంత త్వరగా పరిష్కరించాలని ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను కేంద్ర మంత్రిత్వ శాఖ కోరింది. తమ విజ్ఞప్తి మేరకు రైల్వే రాయితీ విషయం పై కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి కూడా స్పందించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ కు లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం జర్నలిస్టుల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని మామిడి సోమయ్య కోరారు.

## రాష్ట్రపతికి జాతీయ ఎస్సీ కమిషన్ వార్షిక నివేదిక

- ఎస్సీల సాధికారతకై ప్రత్యేక చర్యలు చేపట్టాం..
- వెల్లడించిన వడ్డెపల్లి రామచందర్..



న్యూఢిల్లీ, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : జాతీయ షెడ్యూల్డ్ కులాల కమిషన్ (ఎన్‌సీఎస్‌సీ) 2024-25 వార్షిక నివేదికను రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. న్యూ ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా నేతృత్వంలోని ప్రతినిధి బృందం బుధవారం ఈ నివేదికను అందజేసింది. ఈ బృందంలో కమిషన్ సభ్యులు వడ్డెపల్లి రామచందర్ ప్రముఖంగా పాల్గొన్నారు. ఆయనతో పాటు ఇతర సభ్యులు లవ్ కుష్ కుమార్, డాక్టర్ పార్థ్ బిశ్వాస్, కమిషన్ కార్యదర్శి గుడె శ్రీనివాస్, ఐఏఎస్ రాష్ట్రపతిని కలిసిన వారిలో ఉన్నారు. దేశవ్యాప్తంగా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం, సాధికారత, వారి రాజ్యాంగ, చట్టపరమైన హక్కుల పరిరక్షణకు సంబంధించిన పలు కీలక అంశాలను ఈ నివేదికలో పొందుపరిచారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ రక్షణ చట్టాల పటిష్ట అమలుతో పాటు దళితులకు సమానత్వం, గౌరవం దక్కేలా కమిషన్ చేస్తున్న నిరంతర కృషిని ఈ నివేదిక ద్వారా రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు.

## సాంస్కృతిక కార్యక్రమాలు అందచేసినందుకు ధన్యవాదాలు

- బోనాల పండుగను మరింత సంబరంగా మార్చిన వైనం..
- కృతజ్ఞతలు తెలియజేసిన ఎస్.పీ.క్రాంతి కుమార్..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : ఇటీవల ముగిసిన బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ ద్వారా తమ అభ్యర్థన మేరకు వివిధ దేవాలయాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినందుకు భాష సంస్కృతిక శాఖ డైరెక్టర్ డాక్టర్ ఏనుగు నరసింహ రెడ్డి, ఐఏఎస్ కి సాంస్కృతిక శాఖ కార్యాలయంలో బుధవారం నాడు మర్యాద పూర్వకంగా కలసి ధన్యవాదాలు తెలిపి శాలువాతో సన్మానం చేశారు ఎస్.పి.క్రాంతి కుమార్..



## అప్పుల బాధతో ఊపిరి తీసుకున్న దంపతులు

- అనాథలుగా మిగిలిపోయిన ఇద్దరు పిల్లలు..
- కొత్తగా కట్టుకున్న ఇల్లు అమ్మినా తీరని అప్పులు





నిజామాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో విద్యుత్ శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు నరేష్ (38) అనే వ్యక్తి.. ఆయనకు భార్య మేఘన (34), పిల్లలు అయాన్ష్(9), మిథున్(7)లతో కలిసి జీవిస్తున్నారు. ఈ క్రమంలో కొన్ని నెలల క్రితం రూ.90 లక్షలు అప్పు చేసి సొంత ఇల్లు కొనుక్కున్నారు నరేష్ దంపతులు. ఇంటిపై రుణం వస్తే అప్పు తీర్చేద్దాం అనుకున్న నేపథ్యంలో, రుణం రాకపోవడంతో ఇల్లుఅమ్మేసి కొంత అప్పుతీర్చారు. కాగా ఇంకా మిగిలి ఉన్నఅప్పు గురించి నరేష్ ఆందోళనలో ఉన్నట్టు, మానసిక వైద్యుడి వద్ద చికిత్స కూడా తీసుకుంటున్నట్టు బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లలు స్కూల్‌కు వెళ్లగానే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు నరేష్.. ఆయన భార్య మేఘన పురుగుల మందు తాగి ఆత్మ హత్యకు పాల్పడింది. మేఘన తండ్రి ఫిర్యాదుమేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శివపురాణ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్న

## మాజీ మంత్రి రాజేశం గౌడ్ దంపతులు..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : హైదరాబాద్ మాదాపూర్‌లోని దుర్గం చెరువు సమీపంలో ఉన్న డీఎస్ఆర్ ఫార్చునర్ ప్రైమ్ గ్రేటర్ కమ్యూనిటీలో అగర్వాల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్, ఫార్మసీ ఇండస్ట్రియల్ చైర్మన్ సంజీవ్ గుప్తా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శివపురాణ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మాజీ సీనియర్ మంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గొడిశెల రాజేశం గౌడ్, శ్యామలాదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మధురై నుండి ప్రత్యేకంగా విచ్చేసిన ఆధ్యాత్మిక పండితులు శివపురాణాన్ని భక్తులకు వివరించారు. శివతత్వం, పరమేశ్వరుని మహిమ, ఆధ్యాత్మికతలో శివపురాణం ప్రాధాన్యతను పండితులు వివరించారు. అనంతరం ఆధ్యాత్మిక పండితులు రాజేశం గౌడ్ దంపతులను ప్రత్యేకంగా ఆశీర్వదించి, పరమేశ్వరుని తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో, శివనామస్మరణతో ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగింది.



## రూ. 15 లక్షల జీవిత భీమా పథకం..

- శుభవార్త చెప్పిన సచివాలయ ఉద్యోగుల సొసైటీ..
- ఆగస్టు 15 నుంచి జీవిత బీమా పథకం ప్రారంభం..

హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సహకార పరపతి సొసైటీ తమ సభ్యుల కుటుంబాలకు బలమైన ఆర్థిక భరోసానిచ్చే దిశగా మరొక విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ఆగస్టు 15 స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సొసైటీ సభ్యులకు రూ.15 లక్షల జీవిత బీమా (లోన్ ఇన్సూరెన్స్) పథకాన్ని అందుబాటులోకి తీసుకువస్తున్నట్లు సొసైటీ అధ్యక్షుడు రేండ్ల రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయం, శాసనసభ, లోక్ భవన్ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సేవలందిస్తున్న ఈ సొసైటీ, మే 2025లో నూతన కార్యవర్గం బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోంది.



## ఘనంగా చిన్నారి సిద్ధిక మొదటి జన్మదిన వేడుకలు..



హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) : శంషాబాద్‌లోని ఎస్.ఆర్. క్లాసిక్ కన్వెన్షన్ హాల్ - 2లో పొన్నం రవిచంద్ర గౌడ్ మనవరాలు చిన్నారి సిద్ధిక మొదటి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క), మాజీ సీనియర్ మంత్రివర్యులు, తెలంగాణ రాష్ట్ర తొలి ఫైనాన్స్ కమిషన్ మాజీ చైర్మన్ గొడిశెల రాజేశం గౌడ్ చిన్నారి సిద్ధికకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జగిత్యాల ప్రముఖ వ్యాపారవేత్త గొల్లపల్లి శ్రీనివాస్ గౌడ్ కూడా చిన్నారి సిద్ధికకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆమె ఆయురారోగ్యాలతో, ఆనందంగా, సంతోషంగా, విజయవంతంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# జైలు గోడల మధ్య చదువుల వెలుగు..

- ఎన్ఐఓఎస్ ద్వారా 78 మంది ఖైదీలకు ఎస్సెస్సీ ఉత్తీర్ణత..
- ప్రత్యేక రిమిషన్ ప్రకటించిన జైళ్లశాఖ డీజీ సౌమ్య మిశ్రా..



**కాప్రా, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఖైదీల విద్య, పునరావాసం దిశగా మరో కీలక ముందడుగు పడింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎన్ఐఓఎస్) ద్వారా ఎస్సెస్సీ పరీక్షలకు సిద్ధమైన 78 మంది ఖైదీలు విజయవంతంగా ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా ఉత్తీర్ణులైన ఖైదీలకు జైళ్లశాఖ డైరెక్టర్ జనరల్ డా. సౌమ్య మిశ్రా ధ్రువపత్రాలను అందజేసి అభినందించారు. తెలంగాణ జైళ్లశాఖ ఖైదీలు విద్యను కొనసాగించేందుకు ఎన్ఐఓఎస్‌తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం చర్లపల్లి, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్లతో పాటు హైదరాబాద్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్ నుంచి మొత్తం 108 మంది ఖైదీలు ఎస్సెస్సీ కార్యక్రమంలో నమోదు చేసుకున్నారు. వారి చదువుకు ప్రభుత్వ, అవసరమైన చోట ప్రైవేట్ ఉపాధ్యాయులను నియమించి, ఏడాది పాటు రెగ్యులర్ తరగతులు, మాక్ టెస్టులు, ప్రీ-బోర్డు పరీక్షల ద్వారా శిక్షణ అందించారు. ఉత్తీర్ణులైన 78 మందిలో చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 56 మంది, నిజామాబాద్ సెంట్రల్ ప్రిజన్‌కు చెందిన 15 మంది, హైదరాబాద్ స్పెషల్ ప్రిజన్ ఫర్ ఉమెన్‌కు చెందిన ఏడుగురు ఉన్నారు. ఖైదీల భవిష్యత్తు ఉపాధికి ఉపయో గపడేలా పాఠ్యాంశాలను ఎంపిక చేయడంతో పాటు డేటా ఎంట్రీ ఆపరేటర్ నైపుణ్యాలకు సంబంధించిన అంశాలను కూడా చేర్చారు. ఖైదీలు చూపిన పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసాన్ని డీజీ సౌమ్య మిశ్రా ప్రత్యేకంగా ప్రశంసించారు. విద్య ద్వారా జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావాలనే సంకల్పానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తు లోనూ విద్యను కొనసాగించి తమకు, తమ కుటుంబాలకు మెరుగైన భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ఎస్సెస్సీలో ఉత్తీర్ణత సాధించిన ఖైదీలందరికీ డైరెక్టర్ జనరల్ రిమిషన్‌ను ప్రత్యేక ప్రోత్సాహకంగా ప్రకటించారు. ఇది విద్య, స్వీయాభివృద్ధి, పునరావాసం దిశగా ముందుకు సాగుతున్న ఇతర ఖైదీలకు ప్రేరణగా నిలుస్తుందని ఆమె తెలిపారు. ఇక ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన ఖైదీలను ఎన్ఐఓఎస్ ద్వారా సీనియర్ సెకండరీ (10+2) విద్య కొనసాగించేలా జైళ్లశాఖ ప్రోత్సహించనుంది. మరో 47 మంది ఖైదీలు తాజాగా ఎస్సెస్సీ విద్యలో నమోదు చేసుకున్నారు. 10+2 అనంతరం చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లోని డా. బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా బీఏ కోర్సుల్లో చేరే అవకాశం కూడా ఉంది. అదేవిధంగా ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన 78మంది ఖైదీలు చర్లపల్లి సెంట్రల్ ప్రిజన్‌లో ఏర్పాటు చేసిన ఐటీఐలో వివిధ సాంకేతిక, వృత్తి విద్యా కోర్సులు అభ్యసించేందుకు అర్హులని డీజీ తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని నైపుణ్యాలను పెంచుకుని స్వయం ఆధారిత జీవితం వైపు అడుగులు వేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎన్ఐఓఎస్ అధికారులు, జైలు ఉన్నతాధికారులు, సూపరింటెం డెంట్లు, ఉపా ధ్యాయులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు. ఖైదీల విద్యాప్రయాణంలోప్రోత్సహించి, మార్గనిర్దేశం చేసిన అధికారులు, ఉపాధ్యాయులు, సంక్షేమ అధికారులు, విద్యా సమన్వయకర్తలు, సిబ్బందిని డీజీ ప్రత్యేకంగా అభినందించారు.

# నిమ్స్‌కు 30 నాణ్యమైన వీల్‌చైర్ల విరాళం



**హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఆసుపత్రికి హెల్ప్‌నీడీ సంస్థ ఆధ్వర్యంలో 30 నాణ్యమైన వీల్‌చైర్లను విరాళంగా అందజేశారు. ఒక్కో వీల్‌చైర్ విలువ రూ.11,500 కాగా, వివిధ దాతల సహకారంతో వీటిని నిమ్స్‌కు అందించారు. **వీల్‌చైర్లు అందించిన దాతలు:** స్వర్గీయ సీత అన్నపూర్ణ కాంతమనేని - 5 స్వర్గీయ రావి చిట్టెమ్మ - 4 ఆర్. చిట్టి శ్రావ్య -2 స్వర్గీయ సుశీలాదేవి సఖమూరు, స్వర్గీయ శ్రీ శ్రీరామమూర్తి సఖమూరు - 10 హెల్ప్‌నీడీ సంస్థ -9 ఈ సందర్భంగా నిమ్స్ డైరెక్టర్ ప్రొ. రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ, నిమ్స్‌కు 30 నాణ్యమైన వీల్‌చైర్లను విరాళంగా అందించిన దాతలకు, హెల్ప్‌నీడీ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వీల్‌చైర్లు రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. నడవడానికి ఇబ్బంది పడుతున్న రోగులను ఆసుపత్రిలోని వివిధ విభాగాలకు తరలించేందుకు వీల్‌చైర్లు ఎంతగానో ఉపయోగపడతాయనితెలిపారు. రోగుల సౌకర్యార్థంఅవసరమైన పరికరాలనుఅందించడంలో దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సహకారం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్ర మంలో అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ సల్మాన్, ఆర్ఎంఓ సచిన్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఉజ్జయినీ మహంకాళి ఆలయంలో రుద్రహోమం



**రాంగోపాల్ పేట్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** బుదవారం అమావాస్యసందర్భంగా శ్రీఉజ్జయిని మహాకాళి అమ్మవారి దేవాలయములో రుద్ర హోమంను ఆలయ వేదపండితులు వైభవంగా నిర్వహించారు.హోమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి జి. మనోహర్ రెడ్డి,ధర్మకర్తల మండలి సభ్యులు, సుమారు 150కుపైగ భక్తులు పాల్గొన్నారు.హోమం అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

# ఓటర్ల జాబితాల ముద్రిత ప్రతులు ఇవ్వాలి

- ఈఆర్‌వోకు బీజేపీ బూత్ ఏజెంట్ వినతి




**మనోహరబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ప్రచురించే ముసాయిదా, తుది ఓటర్ల జాబితాల ముద్రిత ప్రతులను గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు అందించాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారికి బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం ముసాయిదా, తుది జాబితాలను చెరో రెండు సెట్ల చొప్పున అందించాలని కోరారు. తెలంగాణలో కొనసాగుతున్న ఎస్ఐఆర్‌లో భాగంగా బూత్ లెవల్ అధికారులు జూన్ 25 నుంచి ఆగస్టు 10 వరకు ఇంటింటి పరిశీలన చేపట్టినట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆగస్టు 17న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించనుండగా.. అదే రోజు నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ అక్టోబర్ 15 వరకు కొనసాగనుంది. అనంతరం అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎలక్టర్స్ రూల్స్, 1960లోని రూల్ 11(సీ), 22(సీ) ప్రకారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాల ముద్రిత ప్రతులను అందించాలని బీజేపీ బూత్ లెవల్ ఏజెంట్ కోరారు. ముసాయిదా జాబితా రెండు సెట్లు, తుది జాబితా రెండు సెట్లను బూత్ లెవల్ ఏజెంట్‌కు అందించాలని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిని విజ్ఞప్తి చేశారు.

# 48 గంటల్లోనే డీజీపీ యాక్షన్..

- జోగులాంబ రేంజ్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్‌పై బదిలీ వేటు..!



**హైదరాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై తెలంగాణ పోలీసు శాఖ కఠిన చర్యలకు శ్రీకారం చుట్టింది. శాఖలో ప్రవర్తన మార్చుకోని అధికారులపై చర్యలు తప్పవని డీజీపీ హెచ్చరించిన కేవలం 48 గంటల వ్యవధిలోనే తొలి వేటు పడింది. జోగులాంబ రేంజ్ (జోన్-7) డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్‌ను ఆ స్థానం నుంచి తప్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తీవ్ర అవినీతి ఆరోపణల నేపథ్యంలో 2009 బ్యాచ్ ఐపీఎస్ అధికారి అయిన ఎల్.ఎస్. చౌహాన్‌ను జోగులాంబ రేంజ్ డీఐజీ బాధ్యతల నుంచి తొలగించి, హెచ్‌ఓపీడీ (డీజీపీ కార్యాలయానికి) అటాచ్ చేశారు. "నలుగురు అధికారుల తీరు మారడం లేదు, చెప్పినా వినడం లేదు" అని డీజీపీ బహిరంగంగా వ్యాఖ్యానించిన రెండు రోజుల్లోనే ఈ నిర్ణయం తీసుకోవడం పోలీసు వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. జనవరి 2023 నుంచి మహబూబ్‌నగర్ కేంద్రంగా జోగులాంబ జోన్ డీఐజీగా చౌహాన్ విధులు నిర్వహిస్తున్నారు.

**మరో నలుగురు డీఎస్పీలపై వేటుకు రంగం సిద్ధం :** శాఖను ప్రక్షాళన చేసే దిశగా డీజీపీ తదుపరి చర్యలకు సమాయత్తమవుతున్నారు. డీఐజీ స్థాయి అధికారిపై వేటు పడటంతో పాటు, పెద్ద మొత్తంలో అవినీతి, అక్రమ ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నలుగురు డీఎస్పీ స్థాయి అధికారులపై కూడా త్వరలోనే చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులు రంగం సిద్ధం చేశారు. తప్పు చేసిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని ఈ చర్య ద్వారా పోలీసు శాఖ స్పష్టమైన సంకేతాలు పంపింది.

# రోడ్డు ప్రమాదాలు అరికట్టేందుకు యూ-టర్న్ మూసివేత

- మేడ్చల్ ట్రాఫిక్ సిఐ

**మేడ్చల్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ రాజరాజేశ్వరి దేవాలయం సమీపంలో ఉన్న యూ-టర్న్‌ను బుధవారం నుంచి పూర్తిగా మూసివేశారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతోపాటు వాహనదారులు, స్థానిక ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. యూ-టర్న్ మూసివేత నేపథ్యంలో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించుకోవాలని పోలీసులు సూచించారు. దేవరాంజాల్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళ్లే వాహనదారులు కొంపల్లి రోడ్డు ఓవర్ బ్రిడ్జి వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ ద్వారా వెళ్లాలని కోరారు. అదే విధంగా కొంపల్లి నుంచి దేవరాంజాల్ వైపు వెళ్లే చిన్న వాహనాలు వి. కన్వెన్షన్ వైపు నుంచి వెహికల్ అండర్‌పాస్‌ను వినియోగించుకోవాలని, భారీ వాహనాలు ప్రెస్టీజ్ పార్క్ వద్ద ఉన్న వెహికల్ అండర్‌పాస్ ద్వారా వెళ్లాలని సూచించారు.

**రాంగ్‌రూట్‌లో వెళితే చట్ట రీత్యా చర్యలు..** మళ్లింపు మార్గాలు, అండర్‌పాస్‌ల సమీపంలో వాహనాల వేగాన్ని తగ్గించి అప్రమత్తంగా ప్రయాణించాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. వాహనదారుల సౌకర్యార్థం ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మూసివేసిన యూ-టర్న్ వద్ద రాంగ్‌రూట్‌లో ప్రయాణించడం చట్టరీత్యా నేరమని పోలీసులు హెచ్చరించారు. రాంగ్‌రూట్‌లో వచ్చే వాహనాల కారణంగా తీవ్ర ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వాహనదారులు మార్పులను గమనించి ట్రాఫిక్ పోలీసులకు సహకరిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# వశిష్ట కాలేజీలో అగ్ని ప్రమాదం.. కఠిన చర్యలు తీసుకోవాలి

- కాలేజీపై షోకాజ్ నోటీసు జారీ చేస్తామని DIEO హామీ



**హయత్ నగర్ ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఎల్.బి. నగర్ నియోజకవర్గం పరిధిలోని వనస్థలిపురంలోని వశిష్ట కాలేజీలో అగ్ని ప్రమాదం జరిగిన విషయం తెలుసుకున్నయువజన కాంగ్రెస్ నాయకులు కాలేజీ దగ్గర నిరసన వ్యక్తం చేశారు. యాజమాన్యంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం DIEO అధికారికి విషయం తెలియజేసి, అధికారులతో కలిసి కాలేజీలో తనిఖీలు నిర్వహించారు. కాలేజీ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికారులకు వినతిపత్రం సమర్పిం చారు. ఈ సందర్భంగా స్పందించిన DIEO అధికారులు. వశిష్ట కాలేజీ యాజమాన్యానికి వెంటనే షోకాజ్ నోటీసు జారీ చేసి, నిబంధనల ఉల్లంఘన ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యార్థుల భద్రతకు సంబంధించినఅంశాల్లో విద్యాసంస్థల యాజమాన్యాలు పూర్తి బాధ్యత వహించా లని యువజన కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు కె. శివకుమార్, నాయకులు మనోజ్ కుమార్, రాజేష్, రాజశేఖర్, అన్వేష్, మణి, జిలానీ, గుణ, అజార్ తదితరులతో పాటు యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ శ్రేణులు పాల్గొన్నారు.

# 29 డిమాండ్ల సాధనకు ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల పోరుబాట

పీఆర్సీ అమలు చేయాలి.. పెండింగ్ డీఏలు విడుదల చేయాలి

జీవో 25 సవరించడంతో పాటు సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్



**కరీంనగర్ ప్రతినిధి, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యూఎస్పీసీ ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ ఎన్. రాజేష్‌కు మెమోరాండం సమర్పించారు. యూఎస్పీసీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పోరుబాటలో భాగంగా మండల కేంద్రాల్లో తహసీల్దార్లకు వినతిపత్రాలు అందజేశారు.

29 డిమాండ్ల పరిష్కారానికి డిమాండ్

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై దశలవారీ పోరాటం.. పీఆర్సీని వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. అదేవిధంగా జీవో నంబర్ 25ను సవరించడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు సంబంధించిన మొత్తం 29 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా యూఎస్పీసీ ప్రతినిధులు మాట్లాడుతూ. ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం యూఎస్పీసీ ఆధ్వర్యంలో దశలవారీగా పోరాట కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో డీటీఎఫ్, టీపీటీఎఫ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నాయకులు తూముల తిరుపతి, వేల్పుల బాలయ్య, కోహెడ చంద్రమౌళి, ప్రభాకర్‌రావు, ఎం.డి. ఫయాజ్ అలీ, ఎం. ఆంజనేయమూర్తి, పి. హరికృష్ణ, జి. చంద్రశేఖర్, కనపర్తి దివాకర్, గణేష్, మొహియుద్దీన్, ఉమామహేశ్వరి, హనుమంతరావు, కాశిపాక రాజు, జి. శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# సీతాఫల్‌మండిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ

- త్రివర్ణ పతాకాలతో మార్మోగిన సీతాఫల్‌మండి
- త్యాగధనుల స్ఫూర్తితో యువభారత్ ముందుకు సాగాలి: మేకల సారంగపాణి



**సికింద్రాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు మేరకు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా సీతాఫల్‌మండి డివిజన్‌లో బీజేపీ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.డివిజన్ అధ్యక్షుడు ఇ.వి.నరేష్ ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీ శివాజీ విగ్రహం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు జాతీయ జెండాలతో ర్యాలీ కొనసాగింది.వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు,విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.దేశ స్వాతంత్ర్యం కోసం ఎందరో మహనీయులు చేసిన త్యాగాలను భావితరాలకు తెలియజేయడంతో పాటు జాతీయతా భావాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.హర్ ఘర్ తిరంగా జిల్లా కన్వీనర్, సికింద్రాబాద్ బిజెపి ఇన్చార్జ్ మేకల సారంగపాణి మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర్య స్ఫూర్తిని చాటాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో మాజీ మేయర్ కార్తిక రెడ్డి, రాచమల్ల కృష్ణమూర్తి,కనకట్ల హరి,నాగేశ్వర్ రెడ్డి,ఆకారం రమేష్,అంబాల రాజేశ్వరరావు,ముఠా గణేష్, నాగరం శ్యామ్,నీలి శ్రీనివాస్,సతీష్ రాజ్,అజయ్,సురేష్ ముదిరాజ్, దీపిక, కిట్టు, లక్ష్మణరావు, వేణుగోపాల్ తదితరులతో పాటు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

# దేశం కోసం మేము సైతం: దివ్యాంగుల తిరంగా ర్యాలీ



**అడ్డగుట్ట, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** దేశం కోసం మేము సైతం అంటూ అడ్డగుట్టలో జరిగిన తిరంగా ర్యాలీలో దివ్యాంగులు పాల్గొని దేశభక్తి నినాదాలు చేశారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు సీహెచ్ కన్నాభిరామ్ ఆధ్వర్యంలో బుధవారం తుకారాం గేట్ సుభాష్ విగ్రహం నుండి ఇందిరాగాంధి విగ్రహం వరకు చేపట్టిన దివ్యాంగుల తిరంగా ర్యాలీలో ముఖ్యఅతిథిగా బీజేపీ దివ్యాంగుల సెల్ రాష్ట్ర కన్వీనర్ కొల్లి నాగేశ్వరరావు పాల్గొని జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో జాతీయ భావం పెంపొందించడం, స్వాతంత్ర్య పోరాట యోధుల గురించి భావి పౌరులు స్మరించు కోవడం, వారి త్యాగాలను తెలుసుకోవడం కోసం కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ హర్ ఘర్ తిరంగా ర్యాలీకి పిలుపునిచ్చారని తెలిపారు. ఈ ర్యాలీలో దివ్యాంగుల స్వచ్ఛందంగా పాల్గొని తమ దేశ భక్తిని చాటుకున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల సెల్ రాష్ట్ర నాయకులు మహంకాళి రవీందర్, పులిపాటి శ్రీనివాస్, మాధవి, భారతి, శ్రీనివాస్ , శ్రావణ్, బీజేపీ నాయకులు సౌందర్య, రవీందర్, శ్యామల, హంస రాజు, రాజశేఖర్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ కక్షల కోసం సామాన్యుడు బలి..



**రాజన్నసిరిసిల్ల, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** వెంకటేశం మృతి పట్ల దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు కేటీఆర్ ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. పార్టీ తరపున అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.. సిరిసిల్లలో హత్యకు గురైన నేత కార్మికుడు వెంగళ వెంకటేశం కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ చిన్నారి పేరు ప్రసన్న. ఐదో తరగతి చదువుతోంది. క్షుద్ర రాజకీయాలు, చిల్లర రాజకీయాల వల్ల ఈ పాప తండ్రిని కోల్పోయింది. ఎందుకు ఆమె తండ్రి చనిపోయాడు.. ఏదైనా చేసి రాజకీయ లబ్ది పొందాలే. అవసరమైతే మనుషుల ప్రాణాలు తీసైనా సరే.. చంపేసి అయినా సరే రాజకీయంగా బద్నాం చేయాలే.. అనే ఒకే ఒక చిల్లర ప్రయత్నంలో వెంగళ వెంకటేశం మన మధ్యలో లేకుండా పోయారు. వాళ్ల భార్య, పాప, తల్లిని అనాథలను చేసి ఆయన పోయారు. రాష్ట్ర రాజకీయాల్లో 20 ఏండ్లుగా నేను కూడా ఉన్నా. ఇంకా చాలా పెద్దలు ఇక్కడ సీనియర్లు కూడా ఉన్నారు. నేను ఎన్నడూ ఇంత దిగజారుడు రాజకీయం, ఇంత దరిద్రపుగొట్టు రాజకీయం జీవితంలో కూడా చూడలేదన్నారు. మా నాన్న రాలేదు.. ఊదు రోజులు నేను తినలేదు అని ఆ పాప ఏడుస్తూ చెప్తుంటే మనస్సున్న మనిషి కళ్లల్లో నీళ్లు తిరగక మానవు. గుండె ద్రవించక మానదని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని రాజకీయంగా ఎదుర్కోవాలి అనుకుంటే ఎన్నికల్లో తలపడొచ్చు? లేదా నాయకులతో విమర్శలు చేయొచ్చు. మీరు ఇప్పటికే చేస్తున్నట్టుగా కేసులుపెట్టొచ్చు.. వేధించొచ్చు. కానీ మధ్యలో సామాన్యులను సమిధలుగా చేసి, బలిపశువులను చేసి వాళ్ల జీవితాలను ఆగం చేస్తే ఏమొస్తదని కాంగ్రెస్ పార్టీ నాయకులను అడుగుతున్నా. చనిపోయింది వెంకటేశం.. అరెస్ట్ చేసింది చోటామోటా కాంగ్రెస్ నాయకులను. కానీ ఆ చోటమోటా కాంగ్రెస్ పార్టీ నాయకులు కేవలం పాత్రదారులు మాత్రమే. అసలు సూత్రదారులు, పెద్దవాళ్లు వెనకాల ఉన్నరు.. తప్పించుకున్నారు. కానీ మేం వదిలిపెట్టం. వెంకటేశం భార్య మమ్మల్ని అడిగింది. అన్నా న్యాయం జరిగేదాకా మాతో ఉండండి అని అడిగింది. ఇల్లుతో ఇబ్బందికరంగా ఉంది. కొత్త ఇల్లు మంజూరు చేయాలని కాంగ్రెస్ నాయకుల దగ్గరకుపోతే దాని కోసం నెలరోజులుగా తిప్పించు కుని ఇవాళ ఈ పరిస్థితి తెచ్చారని కేటీఆర్ మండిపడ్డారు. అందుకే నేనిప్పుడే కలెక్టర్‌తో మాట్లాడి చెప్పిన.. మీరు ఇల్లు ఇస్తరా.. ఇవ్వండి లేదా మా పార్టీ తరపున మేం ఇల్లు కట్టిస్తమని చెప్పినం. ఇప్పుడు ఆ పాపకు 11 ఏండ్లు. ఆమె పేరు మీద రూ.3 లక్షలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినం. ఆమె 18 ఏండ్లు నిండి మేజర్ అయిన తర్వాత మెచ్యూర్ అయ్యేలా డిపాజిట్ కూడా చేశాం. ఆ పాప పదోతరగతి దాకా నేనే చదివిపిస్తానని చెప్పా. చంపి ఆత్మహత్యగా చిత్రీకరించాలనే చిల్లర ప్రయత్నం స్థానిక సిరిసిల్ల కాంగ్రెస్ నాయకత్వం చేసిందో ఇదిఎన్నటికీ కూడా క్షమించరాని నేరం. సభ్య సమాజం కూడా అసహ్యించుకునే దుర్మార్గమైన పరిస్థితని అన్నారు. దయచేసి ఈ కుటుంబానికి న్యాయంచేయాలని పోలీస్ అధికారులను కోరుతున్నానని అన్నారు. ప్రజాప్రతినిధిగా డిమాండ్ చేస్తున్నా. వదిలిపెట్టమని కేటీఆర్ హెచ్చరించారు.

# విద్యుత్ కాంతులతో గ్రామాలు సురక్షితం..

- మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- ఐమాక్స్ లైట్లు ప్రారంభించిన మాజీ ఎంపీపీ
- హర్షం వ్యక్తం చేసిన తాళ్లగూడ గ్రామ ప్రజలు



**నందిగామ ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** విద్యుత్ కాంతులతో ఏ గ్రామలైతే వెలుగుతాయో ఆ గ్రామాలు సురక్షితంగా ఉంటారని మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి తెలిపారు.నందిగామ మండల పరిధిలోని తాళ్లగూడ గ్రామంలో ప్రధాన వీధులలో,కాలనీలలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐమాక్స్ లైట్లను కొత్తూరు మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో విద్యుత్ కాంతులతో విరజిల్లుతుంటే ప్రజలు, విద్యార్థులు రాత్రి వేళల్లో సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు అనువుగా ఉంటుందని, గ్రామాలు కూడ సురక్షితంగా ఉంటాయన్నారు.ఈ ఐమాక్స్ లైట్లను తన స్వంత ఖర్చులతో వేశామని, గ్రామాల్లోని సమస్యల పరిష్కారం కోసం తమ వంతు సహాయ సహకారాలు అందజేస్తామని పేర్కొన్నారు.అనంతరం గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి, మాజీ ఎంపీపీ ని సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు గోవింద్ గౌడ్, చిట్టెడి నరసింహారెడ్డి, మీనాక్షి దశరథ్ నాయక్, మాజీ సర్పంచులు కాట్నా రాజు,రవి నాయక్, ఉపసర్పంచ్ లక్ష్మయ్య, రాములు గౌడ్, వార్డు సభ్యులు ప్రవీణ్ గౌడ్,శ్రీశైలం, పవన్,అనూష విక్రాంత్,నాగేష్ రాణి,బి సత్తయ్య, యాదయ్య, రాజేందర్,మల్లేష్ గౌడ్,శ్రీకాంత్ గౌడ్, యాదయ్య, నరసింహ,రవి, కుమార్,ప్రవీణ్, శ్రీకాంత్,వెంకటేష్ గౌడ్,జయేందర్ రెడ్డి,దామోదర్ రెడ్డి పాపిరెడ్డి, రాజేష్, చిర్ర రాజు,లింగం గౌడ్, రాజు గౌడ్,బోకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# కీసరలో బ్యాటరీ దొంగల హల్‌చల్

- పార్కింగ్ చేసిన లారీలే టార్గెట్
- రాత్రికి రాత్రే బ్యాటరీలు మాయం
- వాహనదారుల్లో ఆందోళన



**కీసర, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** కీసర మండల పరిధిలో రాత్రివేళ పార్కింగ్ చేసిన వాహనాల నుంచి బ్యాటరీలు చోరీకి గురవుతున్న ఘటనలు వాహనదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా లారీలను టార్గెట్‌గా చేసుకుని బ్యాటరీలను అపహరిస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయి. ఈ ఘటనలకు సంబంధించి కీసర పోలీస్ స్టేషన్‌లో వరుసగా ఫిర్యాదులు నమోదవుతున్నాయి. లారీల బ్యాటరీలను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను బోగారం ప్రాంతంలో స్థానికులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న ఘటన కూడా ఇటీవలే చోటుచేసుకుంది.

**- లారీలే టార్గెట్ :**

బోగారం, కీసర ప్రాంతాల్లో రాత్రివేళ పార్కింగ్ చేసిన లారీల నుంచి బ్యాటరీలు చోరీకి గురైన ఘటనలు వెలుగులోకి వచ్చాయి. పగటిపూట సరుకు రవాణాలో బిజీగా ఉండే లారీలు రాత్రివేళ రోడ్డు పక్కన లేదా పార్కింగ్ ప్రదేశాల్లో నిలిపి ఉంచడంతో దొంగలు అదును చూసుకుని బ్యాటరీలను ఎత్తుకెళ్తున్నట్లు వాహనదారులు చెబుతున్నారు. బ్యాటరీ చోరీ కావడంతో ఉదయం లారీని నడిపేందుకు ప్రయత్నించే సమయంలో విషయం బయటపడుతోంది. దీంతో వాహన యజమానులు, డ్రైవర్లు ఆర్థికంగా నష్టపోవడంతో పాటు తమ వాహనాల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**- రాత్రికి రాత్రే బ్యాటరీలు మాయం :**

చోరీలకు సంబంధించి వరుస ఫిర్యాదులు పోలీసులకు అందుతున్న నేపథ్యంలో వాహనదారుల్లో అప్రమత్తత పెరిగింది. ముఖ్యంగా రాత్రివేళ లారీలను ఒంటరి ప్రాంతాల్లో పార్కింగ్ చేయడం వల్ల దొంగలకు అవకాశం లభించే ప్రమాదం ఉందని పలువురు భావిస్తున్నారు. బ్యాటరీలను తొలగించేందుకు దొంగలు తక్కువ సమయంలోనే పని పూర్తి చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో రాత్రి సమయంలో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తులు, వాహనాలపై నిఘా పెంచాలని లారీ యజమానులు కోరుతున్నారు.

**- వాహనదారులకు పోలీసుల సూచనలు :**



బ్యాటరీ చోరీలను అరికట్టేందుకు కీసర పోలీసులు వాహనదారులకు పలు సూచనలు చేస్తున్నారు. లారీలు, ఇతర వాహనాలను వీలైనంత వరకు సురక్షితమైన, వెలుతురు ఉన్న ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలని సూచిస్తున్నారు. సీసీ కెమెరాల పరిధిలో వాహనాలను నిలిపి ఉంచడంతో పాటు, రాత్రివేళ అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరుతున్నారు. అలాగే వాహనాలను ఎక్కువసేపు ఒకే ప్రాంతంలో నిలిపి ఉంచాల్సి వస్తే అదనపు భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. లారీలు ఎక్కువగా పార్కింగ్ చేసే ప్రాంతాల్లో రాత్రివేళ పోలీసుల గస్తీ పెంచాలని వాహనదారులు కోరుతున్నారు. వరుస బ్యాటరీ చోరీల నేపథ్యంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేసి నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని లారీ యజమానులు కోరుతున్నారు.

## మధుమేహ పాదగాయాలకు మొక్కల ఔషధం

- సీఎస్ఐఆర్--ఐఐసీటీ, విరిడిస్ బయోఫార్మా మధ్య సాంకేతిక ఒప్పందం



**సికింద్రాబాద్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మధుమేహంతో బాధపడుతున్న వారిలో తీవ్ర సమస్యగా మారుతున్న పాదగాయాల చికిత్సకు శాస్త్రీయ ఆధారాలతో రూపొందించిన మొక్కల ఆధారిత ఔషధాన్ని అభివృద్ధి చేసేందుకు సీఎస్ఐఆర్--ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీఎస్ఐఆర్--ఐఐసీటీ) కీలక ముందడుగు వేసింది. సీఎస్ఐఆర్--ఐఐసీటీ అప్లైడ్ బయాలజీ విభాగానికి చెందిన డాక్టర్ ఆంథోనీ అడ్డలగట్టా నేతృత్వంలో డాక్టర్ శ్రీగిరిధర్ కోటంరాజు, డాక్టర్ అరుణ జంగం తదితరుల బృందం ఈ సాంకేతికతకు అనుగుణంగా రూపొందించామన్నారు. ఈ సందర్భంగా సీఎస్ఐఆర్--ఐఐసీటీ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, శాస్త్రీయ పరిశోధనలను ప్రజలకు ఉపయోగపడే వైద్య పరిష్కారాలుగా మార్చడంలో ఈ ఒప్పందం కీలకమన్నారు. హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్--ఐఐసీటీ, విరిడిస్ బయోఫార్మా ప్రైవేట్ లిమిటెడ్‌తో సాంకేతిక బదిలీ ఒప్పందం కుదుర్చుకుంది. జిమ్నీమా సిల్వెస్ట్రే (పొడపత్రి) నుంచి అభివృద్ధి చేసిన ఈ ఫైటోఫార్మాస్యూటికల్ ఔషధం మధుమేహ పాదగాయాల చికిత్సకు ఉపయోగపడేలా రూపొందించారు. ఇతర దీర్ఘకాలిక గాయాలు, వాపు సంబంధిత చర్మ వ్యాధుల చికిత్సలోనూ దీనికి అవకాశాలున్నాయి. సీఎస్ఐఆర్ ఫైటోఫార్మాస్యూటికల్ మిషన్ ఫేజ్--3 సహకారంతో పరిశోధనలు కొనసాగాయన్నారు. ఔషధంపై వృక్షశాస్త్ర ప్రమాణీకరణ, ఔషధ ప్రభావం, చర్యా విధానం, విశ్లేషణ, ఫార్మాకోకైనెటిక్స్, ఫార్ములేషన్, జీఎంపీ ప్రక్రియ, స్థిరత్వం, భద్రతా పరీక్షలు పూర్తయ్యాయి. భారత్‌తో పాటు అంతర్జాతీయంగా పేటెంట్ రక్షణ కూడా పొందింది. దీంతో క్లినికల్ అభివృద్ధికి అవసరమైన సమగ్ర డేటా సిద్ధమైంది. విరిడిస్ బయోఫార్మా టెక్నికల్ డైరెక్టర్ డాక్టర్ ఆన్సలెమ్ డి సౌజా మాట్లాడుతూ, అధునాతన గాయాల నిర్వహణలో ఈ సాంకేతికతను వాణిజ్యపరంగా అభివృద్ధి చేయడం సంతోషంగా ఉందన్నారు. ఒప్పందం ప్రకారం విరిడిస్ బయోఫార్మా తదుపరి దశ అభివృద్ధిని చేపట్టి, కేంద్ర ఔషధ ప్రమాణ నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీఓ), అమెరికా ఎఫ్‌డీఏకు నియంత్రణ అనుమతుల కోసం దరఖాస్తులు సమర్పించనుంది. అనంతరం క్లినికల్ పరీక్షల దిశగా ఉత్పత్తిని తీసుకెళ్లనున్నారు.

## చేయూత పింఛన్ పథకానికి కొత్త దరఖాస్తులకు ఆహ్వానం

**మణికొండ, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పింఛన్ పథకం కింద అర్హులైన లబ్ధిదారుల నుంచి కొత్త దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నార్సింగి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జి. లక్ష్మా రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ లక్ష్మా రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 31వ తేదీ వరకు అర్హత కలిగిన వారు చేయూత పింఛన్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. చేయూత పింఛన్ పథకానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, అవసరమైన పత్రాలు మరియు ఇతర పూర్తి వివరాల కోసం నార్సింగి సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని అన్నారు. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకుని ప్రభుత్వ సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## సరికొండలో తాటి ఆకుల అల్లికలపై మహిళలకు శిక్షణ

- 'పామ్ లీఫ్ క్రాఫ్ట్' శిక్షణకు శ్రీకారం
- మహిళలకు ఉపాధి.. రోజుకు రూ.300 దినసరి భృతి
- 25 రోజుల శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ సర్టిఫికెట్




**కడ్తాల్ ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సరికొండ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో బుధవారం పామ్ లీఫ్ క్రాఫ్ట్ (తాటి ఆకుల అల్లికలు)పై శిక్షణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామ సర్పంచ్ అద్దాల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హ్యాండిక్రాఫ్ట్ అసిస్టెంట్ డైరెక్టర్ సువర్చల తన బృందంతో హాజరయ్యారు. ఈ సందర్భంగా సువర్చల మాట్లాడుతూ గ్రామంలోని మహిళలు ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 25 రోజుల పాటు కొనసాగే శిక్షణలో పాల్గొనే మహిళలకు రోజుకు రూ. 300 చొప్పున దినసరి భృతి అందించడంతో పాటు శిక్షణ పూర్తిచేసిన వారికి కేంద్ర ప్రభుత్వం తరఫున సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. తాటి ఆకులతో వివిధ రకాల ఉపయోగకరమైన వస్తువులను తయారు చేయడం ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందవచ్చని వివరించారు.

**- ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా తాటి ఆకుల ఉత్పత్తులు**

ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలకు అనుగుణంగా హ్యాండ్ క్రాఫ్ట్ రంగాన్ని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. సహజంగా లభించే తాటి ఆకులను వినియోగించి వివిధ రకాల అలంకరణ, గృహోపకరణ వస్తువులను తయారు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటంతో పాటు మహిళలకు ఆదాయ మార్గం కల్పించవచ్చని పేర్కొన్నారు.

**- సరికొండకు దక్కిన అరుదైన అవకాశం**

గ్రామ సర్పంచ్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ రంగారెడ్డి జిల్లాలో పామ్ లీఫ్ క్రాఫ్ట్ శిక్షణకు సరికొండ గ్రామాన్ని ఎంపిక చేయడం గ్రామ ప్రజల అదృష్టమని అన్నారు. గ్రామంలోని తాటి వనాన్ని పరిశీలించిన అనంతరం అధికారులు, శిక్షణ బృందం సరికొండను ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. గ్రామంలోని యువతులు, మహిళలు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తాటి ఆకుల అల్లికలపై నైపుణ్యం సాధించడం ద్వారా ఇంటి వద్దే ఉత్పత్తులు తయారు చేసుకుని ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన మహిళలకు ఈ శిక్షణ స్వయం ఉపాధికి మంచి మార్గంగా నిలుస్తుందని పేర్కొన్నారు. మహిళలు శిక్షణను మధ్యలో వదిలిపెట్టకుండా 25 రోజుల పాటు క్రమం తప్పకుండా హాజరై నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని గ్రామ ప్రజాప్రతినిధులు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు, మహిళా సమైక్య సభ్యులు, గ్రామ యువతులు, మహిళలు, శిక్షణ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రెండోసారి రంగుల శంకర్ నేత నియమకం



**జవహర్‌నగర్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధిగా రంగుల శంకర్ నేతను రెండోసారి నియమించారు. ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గంధమల్ల ఆనంద్ గౌడ్ ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా రంగుల శంకర్ నేత మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి కీలక బాధ్యతలు అప్పగించిన గంధమల్ల ఆనంద్ గౌడ్‌కు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తన నియామకానికి సహకరించిన తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు, మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్, మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు బుద్ధి శ్రీనివాస్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఓబీసీ వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తానని, పార్టీ బలోపేతానికి నిబద్ధతతో అంకితభావంతో పనిచేస్తానని రంగుల శంకర్ నేత తెలిపారు.

## పనులు పూర్తి చేయని కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి

- బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



**ఉప్పల్ ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఈరోజు వాటర్ వర్క్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజా ని వారి కార్యాలయంలో కలిసి సుమారు 8 నెలలు గడుస్తున్నా వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్లు సీవరేజ్ పైప్ లైన్ పనులను పూర్తి చేసి దానితో పాటు ఉన్న రోడ్డు రెస్టోరేషన్ లను వేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వారితో వెంటనే రోడ్డు రెస్టోరేషన్ లు పూర్తి చేయించాలని లేనిచో వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ కి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. వర్షాకాలం ని దృష్టిలో పెట్టుకుని సీవరేజ్ పైప్ లైన్ నిర్మాణం చేసిన బీరప్ప గడ్డ, ధర్మపురి కాలనీ, సాయిరాం నగర్ కాలనీ ఇందిరానగర్ కాలనీలో సిసి రోడ్డు రెస్టోరేషన్ పనులను పూర్తిగా నిర్లక్ష్యం చేసిన కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని వారిని కోరడం జరిగింది. సానుకూలంగా స్పందించిన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పంకజ కాంట్రాక్టర్లకి వెంటనే నోటీసులు ఇచ్చి రోడ్డు రెస్టోరేషన్ పనులను పూర్తి చేసే విధంగా చర్యలు చేపడతానని చేయని యెడల వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని అన్నారు.

## జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం..

- కాంగ్రెస్ కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలి
: డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**మేడ్చల్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం మేడ్చల్ సర్కిల్ పరిధిలోని పుడూర్-కిష్టాపూర్ 298 డివిజన్‌లో డివిజన్ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ అనుబంధ కమిటీల నియామకాలపై ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం, పిసరి మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ రానున్న జీహెచ్‌ఎంసీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీకి బలమైన పునాది ఏర్పడేలా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పార్టీ అనుబంధ కమిటీల్లో చురుకైన కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించి ప్రజలకు మరింత చేరువ కావాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని, ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని అన్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కార్యకర్తలు ఇప్పటి నుంచే ప్రజల్లో విస్తృతంగా పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

నాయకులు, కార్యకర్తల సమష్టి కృషితో జీహెచ్‌ఎంసీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయాన్ని సాధించడం ఖాయమని వజ్రేష్ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షుడు మహేష్ కుమార్, నాయకులు సత్యనారాయణ, శ్రీనివాస్ రెడ్డి, పోచయ్య, బల్ రెడ్డి, రేగురాజు, 297 డివిజన్ అధ్యక్షుడు నడికొప్పు నాగరాజు (చాపరాజు), శ్రవణ్ గుప్త, కొండల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, బిపిట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కార్యకర్తలకు అండగా ఉంటాం


- అనారోగ్యంతో చికిత్స పొందుతున్న సిద్ధిగారి శివకు రూ.5 వేల ఆర్థిక సాయం : డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా



**కడ్తాల్ ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటామని డీసీసీబీ డైరెక్టర్, ఆమనగల్ సింగిల్ విండో చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గంప వెంకటేష్ గుప్తా అన్నారు. కష్టకాలంలో కార్యకర్తలకు తోడుగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. కడ్తాల్ పట్టణానికి చెందిన సిద్ధిగారి జంగయ్య కుమారుడు సిద్ధిగారి శివ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని సప్తగిరి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న గంప వెంకటేష్ గుప్తా ఆసుపత్రికి వెళ్లి శివను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అధైర్యపడవద్దని, అవసరమైన సమయంలో అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం ఆసుపత్రి వైద్యులు డాక్టర్ శ్రీనివాసచారితో మాట్లాడి శివ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించి త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులను కోరారు. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయంచికిత్సకు ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన గంప వెంకటేష్ గుప్తా.. గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ. 5,000 ఆర్థిక సహాయాన్ని శివ కుటుంబ సభ్యులకు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న కార్యకర్తలకు, వారి కుటుంబాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మహేష్ గౌడ్, కంబాలపల్లి శ్రీకాంత్, సిద్ధిగారి దాసు, వెంకటేష్, శ్రీకాంత్, నరేష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మర్రి పురురవారెడ్డి పుట్టినరోజు వేడుక

- రోగులకు పండ్ల పంపిణీ



**బేగంపేట్, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** భారతీయ జనతా పార్టీ యువ నేత మర్రి పురురవారెడ్డి పుట్టినరోజు వేడుక బుధవారం బేగంపేట్‌లోని బీజేపీ బిజెపి కార్యాలయంలో ఘనంగా జరిగింది. నియోజకవర్గ పరిధిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం అమీర్‌పేట్ డివిజన్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు చేతుల మీదుగా పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోమర్రి పురురవ రెడ్డితో పాటు అనిల్ గౌడ్, నక్క శ్రీనివాస్ గౌడ్, అజయ్, ప్రవీణ్ గౌడ్, శ్రుతి మరియు జశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



## భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం



**మణికొండ, ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మణికొండ డివిజన్ మరియు నెక్నంపూర్ డివిజన్ లలో భారతీయ జనతా పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు హర్ గర్ తిరంగా కార్యక్రమం నిర్వహించుటకై చర్చించడం జరిగింది. ప్రతి ఒక కార్యకర్త తమ ఇంటి పైన జెండాను ఎగుర వేసి 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దేశభక్తిని చాటుకోవాలని కోరడం జరిగింది. దేశం కోసం ప్రాణాలు అర్పించిన టువంటి అమరవీరులను, దేశ సైనికులను గుర్తు చేసుకోవడం జరిగింది. అలాగే 14 వ తారీకు ఉదయం 11 గంటలకు మణికొండ ఆంధ్రాబ్యాంక్ సర్కిల్ నుండి మర్రిచెట్టు వరకు అలాగే మరి చెట్టు నుండి ఆంధ్ర బ్యాంక్ వరకు తిరంగా ర్యాలీ ఉంటుందని కావున ప్రతి ఒక్కరు పాల్గొని తమ దేశభక్తిని చేసుకోవాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మణికొండ డివిజన్ మరియు నెక్నంపూర్ డివిజన్ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క తొలగింపు పనులను పరిశీలించిన శ్రవణ్



**మల్కాజిగిరి ఆగస్టు 13 (జర్నలిస్ట్ ఫైల్) :** మల్కాజిగిరిలోని సఫిల్‌గూడ చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగింపు పనులను బుధవారం మల్కాజిగిరి మాజీ కార్పొరేటర్ శ్రవణ్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రవణ్ మాట్లాడుతూ, సీవరేజ్ డైవర్షన్ పనులు ప్రారంభమయ్యే వరకు చెరువులో గుర్రపు డెక్క తిరిగి పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. చెరువు వెనుక భాగంలో నూతనంగా బోర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతంలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే చెరువులో చెత్త వేయకుండా స్థానికులు సహకరించాలని, అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈ నవీన్, గోపాల్ సింగ్, రామ్ లగన్, శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

## పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య నటన చిరస్మరణీయం:మంత్రి కందుల దుర్గేష్



- హాస్య నట చక్రవర్తి పద్మశ్రీ రేలంగి 116వ జయంతి
- ఘన నివాళులు అర్పించిన మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం (జర్నలిస్ట్ ఫైల్ ): తెలుగు వెండితెరపై నవ్వులను పూయించడమే కాకుండా, హాస్య నటుడిగా ఎన్టీఆర్, ఏఎన్నార్ లాంటి అగ్ర కథానాయకులతో సమానమైన స్టార్ డమ్ ను పొందిన హాస్య నట చక్రవర్తి, పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఆగస్ట్ 13వ తేదీన రేలంగి వెంకట్రామయ్య 116వ జయంతి వేడుకలను పురస్కరించుకొని రాజమహేంద్రవరంలోని పుష్కర్ ఘాట్ సమీపంలో ఆయన విగ్రహానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కందుల దుర్గేష్, రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ..."నవ్వుల రేడు రేలంగి వెంకట్రామయ్యని ప్రత్యక్షంగా చూడకపోయినా, ఆయన నటించిన అద్భుతమైన చిత్రాల ద్వారా ఆయన నటనా చాతుర్యాన్ని మనమందరం ఆస్వాదిస్తూనే ఉన్నాం. కేవలం హావభావాలతోనే కాకుండా తన విలక్షణమైన గొంతు, నడక, నవ్వులతో పాత్రకు ప్రాణం పోసి, ప్రేక్షక లోకాన్ని సమ్మోహితం చేసిన అభినయ తపస్వి, పద్మశ్రీ పురస్కారాన్ని పొందిన మహానటుడు రేలంగి వెంకట్రామయ్య. ఇటువంటి మహోన్నత నటుడు మన ఉమ్మడి గోదావరి జిల్లాకు చెందిన వ్యక్తి కావడం మనందరికీ ఎంతో గర్వకారణం. భౌతికంగా ఆయన మన మధ్య లేకపోయినప్పటికీ, తనదైన నటన ద్వారా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయి చెరగని నవ్వుల సంతకం చేసిన యుగపురుషుడు.. శెట్టిబలిజ సంఘ నాయకులు, అభిమానులు మరియు ప్రేక్షకులు ప్రతి ఏటా క్రమం తప్పకుండా హాస్యనట సామ్రాట్ రేలంగి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయం" అని పేర్కొన్నారు. తెలుగు సినిమా హాస్యానికి పద్మశ్రీ రేలంగి వెంకట్రామయ్య మకుటం లేని మహారాజు అని కీర్తిస్తూ కార్యక్రమం అనంతరం "జోహార్ రేలంగి వెంకట్రామయ్య" అంటూ మంత్రి దుర్గేష్ నినదించారు. ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ సంఘ నాయకులు, రేలంగి అభిమానులు పాల్గొన్నారు.

## లిక్విడ్ గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై గుంటూరు పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఈస్ట్ డీఎస్పీ టి. సీతారామ్ పర్యవేక్షణలో పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ సిబ్బందితో కలిసి నిర్వహించిన తనిఖీల్లో లిక్విడ్ గంజాయి తరలిస్తున్న వ్యక్తిని అరెస్టు చేశారు. గురువారం ఉదయం 10.15 గంటలకు గుంటూరు ఏపీఎస్ఆర్టీసీ బస్టాండ్–విజయవాడ బస్ సెక్టార్ వద్ద అందిన సమాచారం మేరకు దాడి చేసి కుంచాల శ్రీను (55)ను అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 3 కిలోల లిక్విడ్ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒడిశా నుంచి గంజాయి తీసుకొచ్చి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిపై ఎన్డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 8(సీ) రెడ్ విత్ 20(బి)(ii)(సీ) కింద కేసు నమోదు చేసి మధ్యాహ్నం 12.15 గంటలకు అరెస్టు చేశారు.
గంజాయి మహమ్మారిని నిర్మూలించేందుకు ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు పాత గుంటూరు సీఐ వెంకట ప్రసాద్ తెలిపారు. ఈగల్ టీమ్‌తో సమన్వయంతో గంజాయి విక్రయం, వినియోగం, సరఫరాకు పాల్పడుతున్న వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. గంజాయి కేసుల్లోని పాత నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా కొనసాగిస్తున్నామని, అవసరమైన చోట డ్రగ్ టెస్టులు నిర్వహించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. గంజాయి రహిత గుంటూరు కోసం ప్రజలు సహకరించాలని, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు.

## హత్య కేసును చేదించిన మైదుకూరు పోలీసులు



మైదుకూరు (జర్నలిస్ట్ ఫైల్ ):ఈనెల(ఆగస్ట్ )5వ తేదీన మైదుకూరు మండలం గడ్డమాయపల్లె గ్రామం లో జరిగిన హత్య ని పోలీసులు ఎట్టకేలకి చేదించారు. పొలం బోరు విషయంలో జరిగిన గొడవే హత్య కి కారణమని పోలీసులు వెల్లడించారు. నిందితులు బాల సిద్ధారెడ్డిని హత్య చేసిన షేక్ అబ్దుల్ రసూల్ షేక్ చాంద్ పీర్ శ్రీరాముల వెంకటయ్య లను అరెస్టు చేసారు హత్య కేసును చేదించిన ఇన్స్పెక్టర్ రమణారెడ్డి మరియు సిబ్బందిని డి.ఎస్.పి రాజేంద్రప్రసాద్ అభినందించారు

## అబ్దుల్ కలాం ఆశయాలతో యువత ముందుకు సాగాలి

- ఎమ్మెల్యే గళ్లా మాధవి



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ): భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పిలుపునిచ్చారు. అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని కలాం జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించడంతో పాటు విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేశారు. కలాం జీవితంలోని విలువలు, సేవాభావం, దేశభక్తి, క్రమశిక్షణను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. 'ఎంత ఎదిగినా ఒదిగి ఉండాలి' అనే సూత్రాన్ని కలాం జీవితం నుంచి నేర్చుకున్నానని, కలలు కనడం, లక్ష్యాలను నిర్దేశించుకోవడం, నిరంతరం శ్రమించడం వంటి విలువలను ఆయన యువతకు అందించారని తెలిపారు. పేదరికం, కులం, మతం, పరిస్థితులు విజయానికి అడ్డంకులు కావని, సంకల్పం, కృషి ఉంటే లక్ష్యాలను సాధించవచ్చని కలాం జీవితం నిరూపించిందన్నారు. సోషల్ మీడియా ప్రభావానికి లోనుకాకుండా యువత స్వేచ్ఛగా ఆలోచించి తమ ప్రతిభను వెలికితీయాలని సూచించారు.
గుంటూరులో సైన్స్ మ్యూజియం ఏర్పాటు చేయాలన్న ఫౌండేషన్ ప్రతినిధుల ప్రతిపాదనను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా అమలయ్యేలా సహకరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రతి విద్యార్థి అబ్దుల్ కలాం జీవిత చరిత్రను చదివి, ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టాలని కోరారు. జీవితంలో ఒక లక్ష్యం సాధించిన తర్వాత మరో లక్ష్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని, సమాజ సేవకు అవకాశాలు ఎప్పటికీ ముగియవని అన్నారు.
భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా ఎదుగుతున్న దేశాల్లో ఒకటిగా నిలుస్తోందని, సోషల్ మీడియాలో కనిపించే ప్రతికూల ప్రచారాన్ని మాత్రమే నమ్మకుండా దేశం సాధిస్తున్న విజయాలను కూడా యువత తెలుసుకోవాలని సూచించారు. ఇతర దేశాల్లోని మంచి విధానాలను అధ్యయనం చేసి వాటిని భారత్‌లో అమలు చేసే దిశగా ఆలోచించాలే తప్ప విదేశాలపై మోజు పెంచుకోవద్దన్నారు. కలాం వంటి మహనీయుల కలలను సాకారం చేసే దిశగా ప్రభుత్వ సహకారంతో కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు, విద్యావేత్తలు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

## తల్లికి వందనం విద్యార్థుల భవితకు భరోసా : ఎమ్మెల్యే నసీర్

- విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దూరదృష్టికి నిదర్శనం
- రాష్ట్రంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులు
- మూడేళ్లలో ప్రభుత్వ విద్యలో ఉత్తమ ఫలితాలు
- తల్లికి వందనం కృతజ్ఞత సభలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):తల్లికి వందనంతో విద్యార్థుల భవితకు బంగారు బాటలు వేస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం రాజీవ్ గాంధీ నగర్ 6వ లైన్ శ్రీ వెంకటేశ్వర పబ్లిక్ స్కూల్ లో తల్లికి వందనం కృతజ్ఞత సభ కార్యక్రమానికి ఎమ్మెల్యే రసి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడిలో ఉపాధ్యాయుడు మార్గదర్శి, ఇంట్లో తల్లిదండ్రులే ప్రథమ గురువులు ఈ ఇద్దరూ కలిసి విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దే వేదిక పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ అని, ఇదొక నూతన అధ్యాయమని అన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని, విద్యార్థులకు పోటీతత్వాన్ని అలవర్చుతున్నారని చెప్పారు. పాఠశాలల ప్రారంభానికి ముందే విద్యా కిట్లు, పుస్తకాలు అందిస్తున్నామని, ప్రతి పాఠశాలను మోడల్ గా తీర్చిదిద్దుతున్నామని అన్నారు. దేశంలోనే తల్లికి వందనం కార్యక్రమం ఒక నూతన అధ్యాయానికి నాంది పలికిందని, మిగిలిన రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. ఇక్కడ విద్యార్థులు పడే ప్రతి అడుగు తల్లికి వందనం ద్వారా ప్రగతికి సోపానంగా మారుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉన్నా ఒకరికి మాత్రమే అమ్మ ఒడి అమలు చేశారన్నారు.
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంట్లో ఎంత మంది విద్యార్థులు ఉంటే అందరికీ తల్లికి వందనం అందించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు దక్కుతుందన్నారు. ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన టాలెంట్ ఉంటుందని, ఆ దిశగా ప్రోత్సహిస్తే మంచి ఫలితాలు వస్తాయని చెప్పారు. విద్యార్థులు సృజనాత్మకమైన ఆలోచన విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో తల్లికి వందనం నిధులు జమకావడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు.

## ఎన్డీఏ పాలనపై ప్రజల్లో విశ్వాసం : బీజేపీ నేతలు

- కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా కార్యకర్తల సమష్టి కృషి
- బీజేపీ కీలక నేతలు జయప్రకాష్ నారాయణ, సురేష్ రెడ్డి



మంగళగిరి(జర్నలిస్ట్ ఫైల్ ): మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థుల విజయానికి ప్రతి కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు.
మంగళగిరిలోని బీజేపీ కార్యాలయంలో గుంటూరు జిల్లా బీజేపీ కార్యదర్శి, మంగళగిరి నియోజకవర్గ బీఎల్ఏ–1 పంచుమర్తి ప్రసాద్ (చిన్నా) ఆధ్వర్యంలో గురువారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. జాతీయ కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు, ఆర్టీసీ రీజినల్ చైర్మన్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లి ప్రజల మద్దతు పొందాలని సూచించారు. బీజేపీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే ఎన్డీఏ బలమని, ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేసే అభ్యర్థులను ప్రజల ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బిట్ర శివనారాయణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని అన్నారు. గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు మాట్లాడుతూ మంగళగిరి – తాడేపల్లి కార్పొరేషన్ ఎన్నికలను పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుందని, ఎన్డీఏ అభ్యర్థుల గెలుపునకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. జిల్లా ఇన్‌చార్జి యాళ్ల దొరబాబు, బీఎల్ఏ–1 పంచుమర్తి ప్రసాద్ తదితరులు మాట్లాడుతూ బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి, ఓటర్లతో నిరంతర సంబంధాలు కొనసాగించాలని సూచించారు. సమావేశంలో పార్టీ నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 15 లోగా పంటల బీమా ప్రీమియం చెల్లించాలి

గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):పంటల బీమా ప్రీమియంను ఆగస్టు 15వ తేదీ లోగా చెల్లించాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ కోరారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2026–27 సంవత్సరానికి ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) అమలుకు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, రైతులు చెల్లించవలసిన ప్రీమియం రేట్లు, బీమా కంపెనీల అమలు వివరాలు వివరించారు. అర్హులైన రైతులు సాగు చేసిన నోటిఫైడ్ పంటలకు వర్తించే పథకం ప్రకారం నిర్ణీత గడువులోగా పంటల బీమాలో నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ప్రకృతి వైపరీత్యాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, వర్షాభావం, అధిక వర్షాలు, ఇతర నిబంధనల ప్రకారం సంభవించే పంట నష్టాలకు ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. రైతులు సమీప వ్యవసాయ శాఖ కార్యాలయం, రైతు సేవా కేంద్రాలు, బ్యాంకులు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (ప్యాక్స్), కామన్ సర్వీస్ సెంటర్లు లేదా సంబందిత బీమా కంపెనీ ప్రతినిధులను సంప్రదించి పంటల బీమాలో నమోదు చేసుకోవచ్చన్నారు. అర్హులైన రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగు చేసుకొని నిర్ణీత గడువులోగా పంటల బీమాలో నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## సీఎం పర్యటన భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన ఐజీ, జిల్లా ఎస్పీ



తాడేపల్లి(జర్నలిస్ట్ ఫైల్ ): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉండవల్లి వద్ద సీడ్ యాక్సెస్ రోడ్డును అనుసంధానించే స్టీల్ బ్రిడ్జి, ఎమ్మెల్యే క్వార్టర్స్ ప్రారంభోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో గుంటూరు జిల్లా పోలీసులు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఇతర పోలీసు అధికారులతో కలిసి స్టీల్ బ్రిడ్జి, సీడ్ యాక్సెస్ రోడ్, ఎమ్మెల్యే క్వార్టర్స్, వీఐపీ రూట్, పార్కింగ్ ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.
పర్యటన సందర్భంగా ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, ప్రవేశ–-నిష్క్రమణ మార్గాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని, అన్ని విభాగాల పోలీసులు సమన్వయంతో అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆధునిక కమ్యూనికేషన్ వ్యవస్థల ద్వారా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏపీ రవికుమార్, సీఐ వీరేంద్రబాబు, ఇతర పోలీసు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఎన్‌సీసీ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో యువత ర్యాలీ



మైదుకూరు(జర్నలిస్ట్ ఫైల్): స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో భాగంగా శ్రీ బాలశివ డిగ్రీ కళాశాల, జడ్పీ హైస్కూల్ (బాలుర పాఠశాల) సంయుక్త ఆధ్వర్యంలో గురువారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఎన్‌సీసీ 30 ఆంధ్ర బెటాలియన్ ఆదేశాల మేరకు ఎంపీడీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ సర్కిల్, రాయల్ కూడలి, మార్కెట్, పొట్టి శ్రీరాములు కూడలి వరకు ర్యాలీ కొనసాగింది. రాయల్ కూడలిలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో మైదుకూరు కమిషనర్ రంగస్వామి, ఎంపీడీవో సూపరింటెండెంట్ నాగేంద్ర, మాచనూరు సుబ్బరాయుడు, కళాశాల ప్రిన్సిపల్ ఎస్.బి. సురేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్, ఎన్‌సీసీ సీటీవో భూమిరెడ్డి రవికళ్యాణ్, జడ్పీ హైస్కూల్ ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు. ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి దేశభక్తిని చాటాలని, విద్యార్థి దశ నుంచే యువతలో జాతీయ భావాన్ని పెంపొందించాలని వారు పిలుపునిచ్చారు. 'వందేమాతరం', 'భారత్ మాతాకీ జై' నినాదాలతో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్కౌట్ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలి- ఎంపీపీ వీరనారాయణరెడ్డి



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్ ):ప్రతి ఒక్కరూ ఆసుపత్రి అభివృద్ధికి పాటుపడాలని బి.మఠం ఎంపీపీ వీరనారాయణరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక పీహెచ్సీ నందు హెచ్.డి.ఎస్(హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ) సమావేశం స్థానిక ఎంపీపీ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిహెచ్సి లో పనిచేసే వైద్య సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించకుండా ఎవరి డ్యూటీలు వారు చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి పరిసరాలు ఎల్లవేళలా పరిశుభ్రంగా ఉంచాలని అలా చేయని యెడల సిబ్బందిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే పిహెచ్సిలో మరింత సదుపాయాలు కల్పించాలని రోగులకు వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి వారితో మంచిగా మెలగాలని ఆయన సూచించారు. తాను ఒకటిన్నర నెల మాత్రమే ఎంపీపీ హోదాలో ఉంటానని, తరువాతైనా మాజీ ఎంపీపీ హోదాలో ఇక్కడికి వచ్చి ఆసుపత్రి పనితీరును గమనిస్తానని ఆయన హెచ్చరించారు. ఇదంతా కేవలం మన ఊరి ఆసుపత్రి కాబట్టి మన ఊరి ప్రజలకు రోగాలు వచ్చినప్పుడు వారికి తగిన సహాయం అందించాలన్నదే నా ధ్యేయమన్నారు. అందువల్ల మన ఊరిలో ఉండే ఆసుపత్రిని మనమందరం బాగు చేసుకోవాలని ఆయన కోరారు. అనంతరం ఎంపీపీ పిహెచ్ లోని బాత్రూములను పరిసరాలు రోగులను అన్ని పరిశీలించి ఇలాగే ఉంచాలని సిబ్బందికి సూచించడం జరిగింది. అలాగే పిహెచ్సిలో రోగులు త్రాగునీటికై అవసరమగు కూల్ వాటర్ మినరల్ ప్లాంట్ ను ఉచితంగా అందించేందుకు స్థానిక గ్రామానికి చెందిన ఆవుల దస్తగిరి నాయుడు ముందుకు రావడం గర్వించదగ్గ విషయమని ఆయన అన్నారు. అనంతరం బద్వేల్ డివిజనల్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ మల్లేష్ మాట్లాడుతూ ఎంపీపీ చెప్పినట్లు వారం రోజులలో పిహెచ్సిలో మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైద్యులు సంపత్ కుమార్ స్థానిక వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా ఫుల్ డ్రెస్ రిహార్సల్స్





గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):80వ స్వాతంత్ర దినోత్సవ ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ అమరావతి పెరేడ్ గ్రౌండ్స్ లో గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. పోలీస్ ఇన్స్పెక్టర్ జనరల్ బి. రాజకుమారి చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ గా కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో గుంటూరు పోలీస్ సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ పోలీస్ సమన్వయ అధికారిగా వ్యవహరిస్తున్నారు. పెరేడ్ కమాండర్ గా వైయస్సార్ జిల్లా ప్రొద్దుటూరు ఏ ఎస్ పి యు విభూ కృష్ణ వ్యవహరిస్తుండగా, పెరేడ్ సెకండ్ ఇన్ కమాండ్ గా 14వ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ ఎస్ మహబూబ్ బాషా, పెరేడ్ ఎడ్జెంట్ గా 14వ బెటాలియన్ ఇన్స్పెక్టర్ టి రాఘవేంద్ర వ్యవహరిస్తున్నారు. 80 స్వాతంత్ర దినోత్సవ కార్యక్రమంలో మొదటి కంటిన్ జెంట్ గా కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్, రెండవ కంటిన్ జెంట్ గా కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్, మూడవ కంటిన్ జెంట్ గా కర్ణాటక స్టేట్ పోలీస్, నాలుగవ కంటిన్ జెంట్ గా సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఐదవ కంటిన్ జెంట్ గా విజయనగరం ఏపీఎస్పీ 5వ బెటాలియన్, ఆరవ కంటిన్ జెంట్ గా విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, ఏడవ కంటిన్ జెంట్ గా బాలుర ఎన్సిసి, 8వ కంటిన్ జెంట్ గా బాలికల ఎన్సిసి, తొమ్మిదవ కంటిన్ జెంట్ గా రాష్ట్ర సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్స్ (బాలురు, బాలికలు), పదవ కంటిన్ జెంట్ గా భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, 11వ కంటిన్ జెంట్ గా రెడ్ క్రాస్ సొసైటీ, 12వ కంటిన్ జెంట్ గా ఏపీ సైనిక్ వెల్ఫేర్ శాఖ ప్రదర్శనలో పాల్గొన్నాయి.
బ్యాండ్ ఇన్ నెట్ లో భాగంగా కర్నూల్ ఏపీఎస్పీ రెండవ బెటాలియన్, కాకినాడ ఏపీఎస్పీ మూడవ బెటాలియన్, విజయనగరం ఏపీఎస్పీ ఐదో బెటాలియన్, మంగళగిరి ఏపీ ఎస్పీ ఆరవ బెటాలియన్, వెంకటగిరి ఏపీఎస్పీ 9వ బెటాలియన్, భాకర్పేట ఏపీఎస్పీ 11వ బెటాలియన్, అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్, విశాఖపట్నం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, హైదరాబాద్ ఏపీ యూనిట్ ఎస్ ఏ ఆర్ సి పి ఎల్ పాల్గొన్నాయి. పైప్ బ్యాండ్ గా మంగళగిరి ఏపీఎస్పీ బ్యాండ్ పాల్గొంది.
ఈ కార్యక్రమంలో సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి జె శ్యామలరావు, గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్ కె.మయూర్ అశోక్, సమాచార పౌర సంబంధాల శాఖ ఇన్చార్జ్ సంచాలకులు బి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రోటోకాల్ అనుసరించి సమయాన్ని అనుసరించి కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. 25 శాఖలకు సంబంధించిన ప్రగతిని వివరించే శకటాల ప్రదర్శన జరిగింది.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక
చందాదారులుగా చేరాలని
అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

## అంబేద్కర్ విజన్‌పై వీవీఐటీలో సంకలన గ్రంథం ఆవిష్కరణ



- డిజిటల్ సమాజంలో అంబేద్కర్ విజన్‌కు ప్రత్యేక ప్రాధాన్యం
- అంబేద్కర్ సమానత్వం, గౌరవం ఆధారిత సమాజాన్ని కోరుకున్నారు
- వీవీఐటీ ఛాన్సలర్ విద్యాసాగర్

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ న్యాయం, సమానత్వం, గౌరవం ఆధారిత సమాజాన్ని కోరుకున్నారని, డిజిటల్ యుగంలో ఆయన ఆలోచనలు మరింత ప్రాసంగికంగా మారాయని వీవీఐటీ విశ్వవిద్యాలయం ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్ అన్నారు. డాక్టర్ కంభం జాన్ వెస్లీ శశికాంత్ సంపాదకత్వంలో రూపొందిన 'అంబేద్కర్ విజన్ ఇన్ ది డిజిటల్ ఏజ్' సంకలన గ్రంథాన్ని వీవీఐటీ విశ్వవిద్యాలయంలో ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో వీవీఐటీ డీన్ ఫ్రెష్‌మెన్ డాక్టర్ ఎం.వి. రఘురామ్, సంపాదకులు డాక్టర్ కంభం జాన్ వెస్లీ శశికాంత్, సూరపనేని నాగార్జున పాల్గొన్నారు.

డాక్టర్ జాన్ వెస్లీ శశికాంత్ మాట్లాడుతూ వేద పబ్లికేషన్స్ ప్రచురించిన ఈ సంకలనం అంబేద్కర్ భావజాలానికి, ఆధునిక డిజిటల్ ప్రపంచానికి మధ్య ఉన్న సంబంధాన్ని విశ్లేషిస్తుందని తెలిపారు. రాజ్యాంగ ఆలోచన, నైతికత, డిజిటల్ హ్యూమానిటీ, కృత్రిమ మేధ (ఏఐ), డిజిటల్ పౌరసత్వం వంటి విభిన్న అంశాలను సమకాలీన దృక్పథంతో ఇందులో చర్చించినట్లు వివరించారు. డిజిటల్ ప్రపంచం సమాజాన్ని ఏ దిశగా నడిపిస్తోంది, భవిష్యత్‌లో ఎదురయ్యే సామాజిక సవాళ్లను ఎలా అర్థం చేసుకోవాలనే అంశాలపై ఆలోచించే ప్రతి పాఠకుడికి ఈ గ్రంథం ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.

## జనం మెచ్చిన జననాయకుడు కన్నా లక్ష్మీనారాయణ: ఎమ్మెల్యే గల్లా మాధవి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** జనం మెచ్చిన జననాయకుడు, కొత్త తరానికి స్ఫూర్తి కన్నా లక్ష్మీనారాయణ అని, ఆయన రాజకీయ, ప్రజా సేవా ప్రస్థానం ఎన్సైక్లోపీడియా వంటిదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. సత్తెనపల్లి ఎమ్మెల్యే, మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ జన్మదిన వేడుకలు గురువారం గుంటూరు ఇన్నర్ రింగ్‌రోడ్డులోని శ్రీ కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మాధవి తొలుత కన్నవారితోటలోని కన్నా లక్ష్మీనారాయణ నివాసానికి వెళ్లి మొక్కను అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వేడుకల్లో మాట్లాడుతూ కన్నా లక్ష్మీనారాయణ కేవలం రాజకీయ నాయకుడు కాదని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన జననాయకుడని కొనియాడారు. ఒక కులం, ప్రాంతం, పార్టీకి పరిమితం కాకుండా అన్ని వర్గాల ప్రజల ఆదరణ పొందిన నాయకుడిగా ఆయన ప్రత్యేక గుర్తింపు సాధించారని పేర్కొన్నారు.

పాత తరం నాయకుల అనుభవ సంపదను కొత్త తరానికి అందిస్తున్న ఎన్సైక్లోపీడియా వంటి నాయకుడు కన్నా లక్ష్మీనారాయణ అని మాధవి అభివర్ణించారు. ఆయన రాజకీయ ప్రస్థానం, ప్రజా సేవా దృక్పథం నేటి తరానికి ఆదర్శమన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి గతంలో కన్నా లక్ష్మీనారాయణ సేవలందించారని, అదే నియోజకవర్గానికి ప్రజాప్రతినిధిగా పనిచేసే అవకాశం తనకు రావడం ఆయన ఆశీర్వాదంగా భావిస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో చేపట్టిన అనేక అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులపై ఆయన ముద్ర స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నానని, కన్నా లక్ష్మీనారాయణ చూపిన మార్గంలో ముందుకు సాగుతానని చెప్పారు. రాజకీయ, ప్రజా సేవా రంగాల్లో ఆయన మరిన్ని సంవత్సరాలు సేవలు కొనసాగించాలని ఆకాంక్షించారు.

## వీవీఐటీయూలో విదేశీ ఉన్నత విద్యావకాశాలపై అవగాహనా సదస్సు



**నంబూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ టెక్నాలజికల్ యూనివర్సిటీ (వీవీఐటీయూ)లో విద్యార్థులకు విదేశీ ఉన్నత విద్యావకాశాలు, అమెరికాలో ఎంఎస్ ప్రోగ్రామ్‌లపై అవగాహనా సదస్సు నిర్వహించినట్లు వీవీఐటీయూ ప్రో–ఛాన్సలర్ వాసిరెడ్డి మహదేవ్ తెలిపారు. అమెరికాకు చెందిన ఇల్లినాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఇల్లినాయ్ టెక్) సీనియర్ ఎన్‌రోల్‌మెంట్ కౌన్సెలర్ అక్షయ్ దాల్వీ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు.

వీవీఐటీయూ, ఇల్లినాయ్ టెక్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందం (ఎంవోయూ) ద్వారా విద్యార్థులకు లభించే ప్రయోజనాలను అక్షయ్ దాల్వీ వివరించారు. ఒప్పందం ప్రకారం అర్హత కలిగిన విద్యార్థులకు 25 శాతం ట్యూషన్ ఫీజు స్కాలర్‌షిప్ లభిస్తుందని, ప్రతిభ ఆధారంగా నిబంధనల మేరకు గరిష్ఠంగా 50 శాతం వరకు ఫీజు మినహాయింపు పొందే అవకాశం ఉందని తెలిపారు. అమెరికాలోని అధునాతన పరిశోధనా సౌకర్యాలు, నాణ్యమైన విద్యా వాతావరణం, ఎంఎస్ పూర్తిచేసిన అనంతరం అందుబాటులో ఉండే ఉద్యోగ అవకాశాలను విద్యార్థులకు వివరించారు.

సదస్సులో విద్యార్థులు అడ్మిషన్ల ప్రక్రియ, స్కాలర్‌షిప్‌లు, ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు ఈ సదస్సు ఉపయోగకరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. అనంతరం వీవీఐటీయూ ఛాన్సలర్ వాసిరెడ్డి విద్యాసాగర్, రిజిస్ట్రార్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి అక్షయ్ దాల్వీని సత్కరించారు.

## ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాలలో కనెక్టామిక్ అకాడమీ వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్ ప్రారంభం

- విద్యార్థులకు సమగ్ర జ్ఞానం అందించడమే లక్ష్యం



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు వినూత్న విద్యా విధానాన్ని అందించేందుకు డా. కె. విజయ్ కుమార్ రూపొందించిన కనెక్టామిక్ అకాడమీ వెబ్‌సైట్, యూట్యూబ్ ఛానల్‌ను విశదలలోని ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో గురువారం ప్రారంభించారు. సుమారు వెయ్యి మంది విద్యార్థుల సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, మైసూరుకు చెందిన విద్యావేత్త కె. మురళీ మోహన్ ఈ వేదికలను ప్రారంభించారు.

గుంటూరులోని ఎన్ఆర్ఐ జూనియర్ కళాశాల వివిధ క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులతో పాటు పేరేచర్లలోని ఇంటెల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. సంజయ్, ఇంటెల్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ జయ కుమార్, ఎన్ఆర్ఐ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి. తిలక్ బాబు తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా విద్యార్థులకు కనెక్టామిక్ లెర్నింగ్ మెథడాలజీని పరిచయం చేశారు. వివిధ అంశాలను విడివిడిగా కంఠస్థం చేసుకోవడం కంటే, వాటి మధ్య ఉన్న సంబంధాలను గుర్తించి సమగ్ర జ్ఞానంగా మార్చుకోవడమే ఈ విధానం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా చీజులు, జీజులు వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

కాన్సెప్ట్‌లను పరస్పరం అనుసంధానం చేసుకోవడం ద్వారా విషయాలను లోతుగా అర్థం చేసుకోవడం, ఎక్కువకాలం గుర్తుంచుకోవడం, సమస్యలను వేగంగా పరిష్కరించడం, పరీక్షలకు సమర్థంగా సిద్ధం కావడం వంటి నైపుణ్యాలను విద్యార్థుల్లో పెంపొందించవచ్చని తెలిపారు.

ఇటీవల నిర్వహించిన చీజుల్లో లెర్నర్స్ అకాడమీ విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు గుర్తింపుగా కె. మురళీ మోహన్‌ను కార్యక్రమంలో సత్కరించారు. విద్యార్థులకు క్రమబద్ధమైన మార్గదర్శకత్వం, మెంటరింగ్, పోటీ పరీక్షల సన్నద్ధతలో వినూత్న పద్ధతులు అందించడం ద్వారా మెరుగైన ఫలితాలు సాధించవచ్చని ఈ సందర్భంగా పేర్కొన్నారు. కనెక్టామిక్ అకాడమీ ద్వారా అధ్యయన సామగ్రి, లెక్చర్లు, విజువల్ రిసోర్సెస్, యానిమేషన్లు, డిజిటల్ విద్యా కంటెంట్‌ను ఒకే ఆన్‌లైన్ వేదికపై అందుబాటులోకి తీసుకురానున్నారు. చీజులు, జీజులు విద్యార్థులకు నాణ్యమైన విద్యా వనరులను అందించి, వారి పోటీ పరీక్షల సన్నద్ధతను మరింత బలోపేతం చేయడమే అకాడమీ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

## ఆగస్టు 16న ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం




**విజయవాడ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఉద్యోగుల న్యాయమైన సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు స్పష్టమైన నిర్ణయాలు వెలువడకపోవడంతో తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చించేందుకు ఏపీ జేఏసీ అమరావతి ఉద్యమ కార్యాచరణ కమిటీ, రాష్ట్ర సెక్రటేరియట్ సమావేశాన్ని ఈ నెల 16న నిర్వహించనున్నట్లు సంఘం రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఆదివారం ఉదయం 10 గంటలకు విజయవాడ రెవెన్యూ భవన్‌లో అత్యవసర సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొప్పరాజు, పాలిశెట్టి తెలిపారు.

ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ నిర్ణయాల మేరకు గత జూలై 22న అన్ని ఉద్యోగ సంఘాలతో జరిగిన జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ సమావేశంలో మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో ఉద్యోగుల సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ముఖ్యంగా పీఆర్సీ కమిషనర్ నియామకం, మధ్యంతర భృతి ప్రకటన, పెండింగ్ డీఏల విడుదల, పెండింగ్ బకాయిల చెల్లింపు, అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్ పునరుద్ధరణ, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం తదితర 29 డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

ఆగస్టు 15లోపు ప్రభుత్వం నుంచి ఆయా డిమాండ్లపై స్పష్టమైన వైఖరి వెలువడకపోతే రాష్ట్ర సెక్రటేరియట్, ఉద్యమ కార్యాచరణ కమిటీ సమావేశం నిర్వహించి తదుపరి కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటామని ఆగస్టు 2న జరిగిన సమావేశంలో రాష్ట్ర నాయకత్వం ప్రకటించిన విషయాన్ని గుర్తుచేశారు. అయితే ఇప్పటివరకు ఉద్యోగుల న్యాయమైన సమస్యలపై ప్రభుత్వం నుంచి ఎలాంటి నిర్ణయాలు వెలువడలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో 16న జరిగే సమావేశంలో ప్రస్తుత పరిస్థితిని సమీక్షించి, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టాల్సిన తదుపరి ఉద్యమ కార్యాచరణపై చర్చించనున్నట్లు చెప్పారు. సమావేశానికి ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, మహిళా విభాగం రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు, ఉద్యమ కార్యాచరణ కమిటీ సభ్యులు, నాలుగు జోన్ల ఇన్‌చార్జులు, మహిళా విభాగం ఇన్‌చార్జులు, 13 జిల్లాల ఉద్యమ కమిటీ ఇన్‌చార్జులు హాజరవుతారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు, స్పందన, భవిష్యత్ కార్యాచరణపై సమావేశంలో విస్తృతంగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సమావేశం అనంతరం ఉద్యమ కార్యాచరణ కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియా ప్రతినిధులకు వెల్లడిస్తామని బొప్పరాజు, పాలిశెట్టి తెలిపారు.

## వైసీపీ హయాంలో ఏపీపీఎస్సీ 'అక్రమార్కుల కమిషన్'గా మారింది: మంత్రి కందుల దుర్గేష్



**నిడదవోలు(జర్నలిస్ట్ ఫైల్ ):** వైసీపీ ఐదేళ్ల పాలనలో ఏపీపీఎస్సీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన కమిషన్‌గా మారిపోయిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆరోపించారు.

ఉండ్రాజవరం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన గ్రూప్–1 నియామకాల అక్రమాలపై సిట్ ఇచ్చిన 132 పేజీల నివేదిక ఆ పాలనకు నిదర్శనమన్నారు. నిబంధనలకు విరుద్ధంగా మూడుసార్లు రీవాల్యుయేషన్ చేసి, 95 శాతం జవాబు పత్రాలపై వైట్‌నర్ వినియోగించారని ఆరోపించారు. పదో తరగతి, ఇంటర్ చదివిన సెక్యూరిటీ గార్డులు, ఎలక్ట్రీషియన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో జవాబు పత్రాలు దిద్దించారని మండిపడ్డారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేసిందని మంత్రి తెలిపారు. ఉద్యోగం రాని నిరుద్యోగులు నిరాశ చెందవద్దని, అక్టోబర్‌లో మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందన్నారు. ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించని వైసీపీ నేతలు చేస్తున్న ప్రచారాన్ని నిరుద్యోగులు నమ్మవద్దని సూచించారు. డీఎస్సీపై ధైర్యముంటే శాసనసభకు వచ్చి చర్చించాలని సవాల్ చేశారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తోందన్నారు. ప్రజలకు దూరమైన వైసీపీకి రానున్న రోజుల్లో సింగిల్ డిజిట్ స్థానాలే దక్కుతాయని మంత్రి వ్యాఖ్యానించారు.

## మ్యాథ్స్-సైన్స్ ఉమ్మడి టెట్ విధానాన్ని హేతుబద్ధీకరించాలి

- మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్‌కు వేర్వేరు టెట్ పేపర్లు ఇవ్వాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి(జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ టెట్ పేపర్–II(ఏ)లో ప్రస్తుతం అమలులో ఉన్న మ్యాథమెటిక్స్–సైన్స్ ఉమ్మడి పరీక్ష విధానాన్ని హేతుబద్ధీకరించి, మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ అభ్యర్థులకు వారి సంబంధిత సబ్జెక్టుల ఆధారంగా వేర్వేరు కన్‌సెర్న్–సబ్జెక్ట్ టెట్ పేపర్లు లేదా ఆప్షన్లు కల్పించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు ఎన్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు కరణం హరికృష్ణ, ప్రధాన కార్యదర్శి మాగంటి శ్రీనివాసరావు ప్రాతినిధ్యం సమర్పించారు.

మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ వేర్వేరు బోధనా స్పెషలైజేషన్లు కాగా, విద్యార్హతలు, సబ్జెక్టు నైపుణ్యాలు, బోధనా పద్ధతులు, స్కూల్ అసిస్టెంట్ నియామకాలు కూడా ప్రత్యేకంగా ఉన్నాయని తెలిపారు.

ప్రస్తుతం టెట్ పేపర్–II(ఏ)లో మ్యాథమెటిక్స్–సైన్స్ విభాగానికి 60 మార్కులు కేటాయించి, మ్యాథమెటిక్స్ కంటెంట్‌కు 24, మ్యాథమెటిక్స్ పెడగాజీకి 6, ఫిజికల్ సైన్స్‌కు 12, బయాలజికల్ సైన్స్‌కు 12, సైన్స్ పెడగాజీకి 6 మార్కుల చొప్పున ఉమ్మడిగా పరీక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఇతర సబ్జెక్టుల అభ్యర్థులకు 48 మార్కుల కన్‌సెర్న్–సబ్జెక్ట్ కంటెంట్, 12 మార్కుల పెడగాజీ కలిపి 60 మార్కులు కేటాయిస్తున్నప్పుడు, మ్యాథ్స్, సైన్స్ అభ్యర్థులకు మూడు విభాగాలను కలిపి పరీక్షించడం హేతుబద్ధం కాదని అభిప్రాయపడ్డారు.

దీనివల్ల మ్యాథమెటిక్స్ అభ్యర్థి సైన్స్ ప్రశ్నలకు, ఫిజికల్ సైన్స్ అభ్యర్థి మ్యాథమెటిక్స్, బయాలజికల్ సైన్స్ ప్రశ్నలకు, బయాలజికల్ సైన్స్ అభ్యర్థి మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్ ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సి వస్తోందన్నారు. టెట్ స్కోర్‌కు 20 శాతం వెయిటేజీ ఉన్న నేపథ్యంలో సంబంధిత సబ్జెక్టుతో ప్రత్యక్ష సంబంధం లేని ప్రశ్నల మార్కులు నియామక మెరిట్‌ను ప్రభావితం చేసే అవకాశం ఉందని తెలిపారు.

టెట్ ప్రమాణాలను తగ్గించాలని తాము కోరడం లేదని, అభ్యర్థి ఏ సబ్జెక్టును బోధించేందుకు విద్యార్హత పొందాడో, ఏ సబ్జెక్టు పోస్టుకు నియమించబడతాడో అదే అంశంలో జ్ఞానం, బోధనా సామర్థ్యాన్ని ప్రధానంగా పరీక్షించాలని ఎన్‌టీఏ పేర్కొంది. పేపర్–II(ఏ)లో మ్యాథమెటిక్స్, ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్‌కు వేర్వేరు కన్‌సెర్న్–సబ్జెక్ట్ ఆప్షన్లు లేదా పేపర్లు కల్పించి, భాషలు, చైల్డ్ డెవలప్‌మెంట్ అండ్ పెడగాజీ, ఐసీటీ వంటి ఉమ్మడి అంశాలను యథావిధిగా కొనసాగించాలని కోరింది. అవసరమైతే ఎస్–సీఈఆర్‌టీ సబ్జెక్టు నిపుణులు, టీచర్ ఎడ్యుకేటర్లు, మూడు సబ్జెక్టుల ఉపాధ్యాయ ప్రతినిధులతో నిపుణుల కమిటీ ఏర్పాటు చేసి విధానాన్ని అధ్యయనం చేయాలని, అవసరమైన చోట ఎన్‌సీటీఈ అనుమతులు లేదా స్పష్టత తీసుకుని రానున్న టెట్‌ల నుంచే సబ్జెక్టు ఆధారిత మూల్యాంకన విధానాన్ని అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది

## కన్నా లక్ష్మీనారాయణ ను సన్మానించిన సత్తెనపల్లి మండల పరిషత్ అధికారులు

**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ 50 ఏళ్ళ రాజకీయ జీవితాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా.. గురువారం గుంటూరు శ్రీ కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కన్నా ను సత్తెనపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారులు ఘనంగా సన్మానించి, గోల్డ్ ప్యాకెట్ గిఫ్ట్ ను బహుకరించారు. సత్తెనపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి బండి శ్రీనివాసరెడ్డి, డిప్యూటీ ఎం.పి.డి.ఓ లు తోకల సుధారాణి, ఎ. కిషోర్, మండల పంచాయతీ కార్యదర్శులు రాజేష్, సురేష్, శ్రీను, లతీఫ్, వీరాంజనేయులు, గౌస్ బాషా, చాంద్ బాషా తదితరులు పాల్గొన్నారు.



## అవయవదానంపై యువతలో అవగాహన పెరగాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** అంతర్జాతీయ అవయవ దాన దినోత్సవం సందర్భంగా జేకేసీ కళాశాలలో అవయవదాన అవగాహనా సదస్సు నిర్వహించారు. జాతీయ శరీర అవయవ దాతల సంఘం వ్యవస్థాపకురాలు గూడూరు సీతామహాలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని అవయవదానంపై ఉన్న అపోహలను వీడి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అవయవ దాతల సంఘం అధ్యక్షుడు డాక్టర్ రమణ యశస్వి మాట్లాడుతూ బ్రెయిన్‌డెడ్ అయిన వారి కుటుంబ సభ్యులు అవయవదానానికి ముందుకు వస్తే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు.

అవయవదానంపై అవగాహన కల్పించేందుకు 'మరణించినా జీవించండి' అనే లఘుచిత్రాన్ని ప్రదర్శించారు. అవయవదానంపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్, గుంటూరు జిల్లా అధ్యక్షురాలు రాధారాణి, కోశాధికారి కృష్ణకుమారి, డాక్టర్ కల్పన, గిరిభూషణ్, పింగళి భాగ్యలక్ష్మి, చెలికాని సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

## జూనియర్ వైద్యుల సమ్మెకు ప్రభుత్వ వైద్యుల సంఘం - ఆంధ్రప్రదేశ్ సంఘీభావం

- న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి
- పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా ఉపకార వేతనం సవరించాలి
- పదవీ విరమణ వయస్సు పెంపు సరికాదు
- బోధనా నియామకాల్లో అర్హత, అనుభవానికి ప్రాధాన్యం ఇవ్వాలి



**గుంటూరు(జర్నలిస్ట్ ఫైల్ ):** రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ వైద్యులు చేపట్టిన సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్ఛంద రిలే నిరాహార దీక్ష రెండో రోజు కొనసాగింది. సమ్మె రెండో దశలో భాగంగా జూనియర్ వైద్యులు గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం సమీపంలో శాంతియుతంగా ఆందోళన కొనసాగించారు. జూనియర్ వైద్యుల ఆందోళనకు మద్దతుగా ప్రభుత్వ వైద్యుల సంఘం - ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వరూప్ కాంత్‌తో పాటు డాక్టర్ కట్టా శ్రీనివాసరావు, డాక్టర్ సీహెచ్ రమ్య, డాక్టర్ కే. మారుతీదేవి, డాక్టర్ వై. రవీంద్రకుమార్, డాక్టర్ ఎస్. అరుణాదేవి, డాక్టర్ బి. శివగోపాల్, డాక్టర్ పి. రాజా, డాక్టర్ అజయ్, డాక్టర్ పి. సుధారాణి, డాక్టర్ టి. వెంకట శివరామకృష్ణ, డాక్టర్ పి. టాబితా, డాక్టర్ మురళి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్యుల సంఘం–ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు మాట్లాడుతూ జూనియర్ వైద్యులు చేస్తున్న డిమాండ్లు న్యాయమైనవని, వైద్య రంగ భవిష్యత్తుతో ముడిపడి ఉన్న ముఖ్యమైన అంశాలని పేర్కొన్నారు. వైద్య విద్యను అభ్యసించే సమయంలో ఫీజులు, వసతి గృహ రుసుములు, అద్దెలు, పుస్తకాలు, వైద్య సదస్సులు, ఇతర విద్యా సంబంధిత ఖర్చులు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు అనుగుణంగా జూనియర్ వైద్యుల ఉపకార వేతనాన్ని సకాలంలో సవరించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం జూనియర్ వైద్యుల సమస్యలను సానుకూలంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని కోరారు.

**పదవీ విరమణ వయస్సు పెంపు సరికాదు:** నిర్దేశిత నిబంధనలకు మించి నియామకాలు చేపట్టడం, పదవీ విరమణ వయస్సును పెంచడం వల్ల యువ వైద్యులకు ఉద్యోగ, బోధనా అవకాశాలు తగ్గే అవకాశం ఉందని ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. పదవీ విరమణ వయస్సు పెంపు సరికాదని స్పష్టం చేశారు. అయితే సీనియర్ వైద్యుల అనుభవం, విజ్ఞానం రాష్ట్ర వైద్య రంగానికి ఎంతో అవసరమని పేర్కొన్నారు. 63 ఏళ్ల వయస్సులో పదవీ విరమణ అనంతరం కూడా సీనియర్ అధ్యాపకుల అనుభవాన్ని సలహా సేవలు, శిక్షణ, వైద్య విద్య, ఇతర తగిన బాధ్యతల్లో వినియోగించుకోవచ్చని సూచించారు.

**అర్హత కలిగిన వారికే బోధనా అవకాశాలు:** ఎంఎస్సీ, పీహెచ్‌డీ అర్హత కలిగిన బోధనా సిబ్బంది నియామకాల విషయంలో స్పష్టమైన విధానం అవసరమని ప్రభుత్వ వైద్యుల సంఘం – ఆంధ్రప్రదేశ్ ప్రతినిధులు తెలిపారు. వైద్య కళాశాలలు, జాతీయ స్థాయి వైద్య సంస్థల్లో తగిన శిక్షణ పొందిన, వైద్య విద్యార్థులకు బోధించడంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. వైద్య విద్య బోధనలో తగిన అనుభవం లేని వైద్యేతర సంస్థల నుంచి నియామకాలు చేపట్టకూడదని స్పష్టం చేశారు. అర్హత కలిగిన వైద్య స్నాతకోత్తర బోధనా సిబ్బంది అందుబాటులో లేని సందర్భంలో మాత్రమే ఇటువంటి నియామకాలను పరిగణించాలని, అవి మొత్తం నియామకాల్లో 10 శాతానికి మించకూడదని సూచించారు. జూనియర్ వైద్యుల న్యాయమైన డిమాండ్లకు సంఘీభావం తెలిపిన ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులకు ఆంధ్రప్రదేశ్ జూనియర్ వైద్యుల సంఘం కృతజ్ఞతలు తెలిపింది. తమ సమస్యలు, భవిష్యత్తు అవకాశాల పరిరక్షణకు మద్దతుగా నిలిచిన ప్రభుత్వ వైద్యుల సంఘానికి ధన్యవాదాలు తెలిపింది. ప్రభుత్వం జూనియర్ వైద్యుల డిమాండ్లపై సానుకూలంగా స్పందించి, ఉపకార వేతనం సవరణ, బోధనా నియామకాల్లో అర్హతకు ప్రాధాన్యం, యువ వైద్యుల అవకాశాల పరిరక్షణ వంటి అంశాలపై తగిన నిర్ణయాలు తీసుకోవాలని కోరింది.

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467